
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనకాపల్లి
జిల్లా వార్తలు
శనివారం 27 సెప్టెంబరు 2025



## 4న జడ్పీ సర్వసభ్య సమావేశం

విశాఖపట్నం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం వచ్చే నెల నాలుగో తేదీన చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన జరుగుతుందని జడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి తెలిపారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని అన్ని విభాగాల అధికారులు పూర్తి నివేదికలతో రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సమావేశానికి జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, ఇతర గౌరవ సభ్యులు, అధికారులు హాజరుకావాలని సీఈవో కోరారు.

# పర్యాటక ప్రగతి అంతంతే!

కాగితాలకే పరిమితమవుతున్న ప్రతిపాదనలు

- కనీస సదుపాయాలకు నోచుకోని సాగర తీర ప్రాంతాలు
- బొజ్జన్నకొండ అభివృద్ధికి గ్రీన్ సిగ్నల్ ఇవ్వని కేంద్రం
- కార్యరూపం దాల్చని కొండకర్ల ఆవ అభివృద్ధి

నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం



అభివృద్ధికి నోచుకోని తంతడి బీచ్

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

**జిల్లాలో పర్యాటక అభివృద్ధి ఒక అడుగు ముందుకు, రెండు అడుగులు వెనక్కు అన్నట్టుగా వుంది. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత పర్యాటక అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. కానీ ఏడాది దాటినా ప్రతిపాదనలు కార్యరూపం దాల్చలేదు. నిధుల కొరత, పరిపాలనా పరమైన అడ్డంకుల కారణంగా ఆశించిన స్థాయిలో పర్యాటక అభివృద్ధి జరగడం లేదు. శనివారం ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా జిల్లాలో పర్యాటక ప్రదేశాల స్థితిగతులపై ప్రత్యేక కథనం.**



కొండకర్ల ఆవ వద్ద నాటు పడవలు

జిల్లాలో సుదీర్ఘ సాగర తీరం, రాష్ట్రంలో రెండో అతిపెద్ద మంచినీటి సరస్సుగా గుర్తింపు పొందిన కొండకర్ల/ వాడ్రాపల్లి ఆవ, ప్రసిద్ధి చెందిన పురాతన పుణ్యక్షేత్రాలు, అనకాపల్లి సమీపంలో బౌద్ధ ఆరామం, కృష్ణాదేవిపేటలో అల్లూరి స్మారక ప్రదేశం, పలు జలాశయాలు వున్నాయి. తెలుగుదేశం పార్టీ గతంలో అధికారంలో వున్నప్పుడు ఆయా ప్రదేశాలను పర్యాటకంగా, ఆధ్యాత్మికంగా కొంత మేర అభివృద్ధి చేసింది. తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం పర్యాటక రంగాన్ని పూర్తిగా గాలికొదిలేసింది. ఐదేళ్ల కాలంలో పర్యాటక ప్రదేశాలు, సందర్శనీయ స్థలాల నిర్వహణ, అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదు. దీంతో ఆయా ప్రాంతాలు అధ్వానంగా తయారయ్యాయి.

### ప్రతిపాదనల్లోనే బొజ్జన్నకొండ అభివృద్ధి

ప్రముఖ బౌద్ధ క్షేత్రం బొజ్జన్నకొండను పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం గతంలోనే రూ.7 కోట్లు మంజూరు చేసింది. కానీ అప్పట్లో అధికా రంలో వున్న వైసీపీ పాలకులు ఈ నిధులను సద్వినియోగం చేయలేదు. రూ.కోటి వ్యయంతో నిర్మించిన ఎమినిటీ సెంటర్ భవనాన్ని అందుబాటులోకి తీసుకు రాలేదు. కేంద్ర పురావస్తు శాఖ ఆధీనంలో వున్న బొజ్జన్న కొండను సందర్శించడానికి నిత్యం పెద్ద సంఖ్యలో పర్యాటకులు వస్తుంటారు. కొండపైన, గుహలోపల శిల్ప సంపద, బుద్ధుని విగ్రహాలు, ధ్యాన మందిరాలు, పెద్ద పెద్ద ఇటుకలతో కట్టిన ధ్యాన ప్రదేశాలు వున్నాయి. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత బొజ్జన కొండను ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు రూపొందించి కేంద్ర ప్రభుత్వానికి పంపారు. కానీ ఇంతవరకు గ్రీన్ సిగ్నల్ లభించలేదు. పరిపాలన పరమైన ఆమోదం లభించగానే అభివృద్ధి పనులు చేపడతామని అధికారులు చెబుతున్నారు.

### కళ తప్పిన సముద్ర తీర ప్రాంతాలు

జిల్లాలో పరవాడ మండలం నుంచి పాయకరావుపేట మండలం వరకు సుమారు 80 కిలోమీటర్ల మేర సముద్ర తీరం వుంది. తిక్కవానిపాలెం, ముత్యాలమ్మపాలెం, వాడ పాలెం (తంతడి), పూడిమడక, సీతపాలెం, రాంబిల్లి, కొత్తపట్నం, బంగారమ్మపాలెం, రేవు పోలవరం, రాజయ్యపేట ... మిగతా 6వ పేజీలో

# స్టీల్ ప్లాంట్‌కు తొలి అడుగు

నేడు ప్రజాభిప్రాయ సేకరణ

నక్కపల్లి మండలంలో ఆర్సెలర్ మిట్టల్, నిప్పన్ ఉక్కు ఫ్యాక్టరీ

- పాటిమీద గ్రామంలో ఏర్పాట్లు
- 400 మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు
- మొత్తం పెట్టుబడి రూ.1,47,162 కోట్లు
- మొదటి దశ 2029 జనవరి నాటికి పూర్తి
- 7.3 మిలియన్ టన్నుల వార్షిక ఉత్పత్తి
- రెండో దశ 2033 నాటికి పూర్తి
- 10.5 మిలియన్ టన్నుల వార్షిక ఉత్పత్తి
- 61 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు



ప్రజాభిప్రాయ సేకరణ సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

నక్కపల్లి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి):

**పాయకరావుపేట నియోజకవర్గం నక్కపల్లి మండలంలో విశాఖ- చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ భూముల్లో భారీ ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు కాలుష్య నియంత్రణ మండలి, పర్యావరణ అనుమతులకు సంబంధించి శనివారం ప్రజాభిప్రాయసేకరణ జరగనుంది. చందనాడ శివారు పాటిమీద గ్రామంలో నిర్వహించే ఈ సభ కోసం అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోండా 400 మంది పోలీసు సిబ్బందిని నియమించారు.**

ఆర్సెలర్ మిట్టల్, నిప్పన్ స్టీల్ కార్పొరేషన్.. ప్రపంచంలోనే దిగ్గజ ఉక్కు తయారీ సంస్థలు. యూరప్‌లోని లక్సెంబర్గ్‌కు చెందిన ఆర్సెలర్ మిట్టల్, జపాన్‌కు చెందిన నిప్పన్ స్టీల్ సంస్థలు సంయుక్తంగా ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చి, 'ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా లిమిటెడ్ (ఏఎం ఎన్ ఎస్ఐ) పేరిట జేవీగా ఏర్పాటయ్యాయి. నక్కపల్లి మండలంలో భారీ ఉక్కు కర్మాగారాన్ని ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. ఈ మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రీన్ సిగ్నల్ ఇచ్చాయి. ఇందుకు అవసరమైన భూమి, మౌలిక సదుపాయాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సంసిద్ధత వ్యక్తం చేసింది.

మొత్తం రూ.1,47,162 కోట్ల భారీ పెట్టుబడితో రెండు దశల్లో దీనిని నిర్మిస్తారు. 7.3 మిలియన్ టన్నుల వార్షిక ఉక్కు ఉత్పత్తి సామర్థ్యంతో 2029 జనవరి నాటికి తొలి దశ, 10.5 మిలియన్ టన్నుల వార్షిక ఉక్కు ఉత్పత్తి సామర్థ్యంతో 2033 నాటికి రెండో దశ ఉత్పత్తి ప్రారంభం అవుతాయి. మొత్తం 61 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఉక్కు ఫ్యాక్టరీ తొలి దశ నిర్మాణం కోసం నక్కపల్లి మండలం బుచ్చిరాజుపేటలో 102.18 ఎకరాలు, చందనాడలో 840.2 ఎకరాలు, డీఎల్ పురంలో 674.39 ఎకరాలు, రాజయ్యపేటలో 36.62 ఎకరాలు, వేంపాడులో 510.92 ఎకరాలు కలిపి మొత్తం 2,164.31 ఎకరాలను కేటాయించారు. ఒకే బ్లాక్ కింద ఉన్న ఈ భూములను ఇండస్ట్రియల్ కారిడార్ కోసం ఏపీఐఐసీ గతంలోనే సేకరించింది. తొలి దశ సివిల్ వర్క్‌లు పూర్తిచేసి యంత్ర పరికరాలను అమర్చాక.. ఆయా పనుల పురోగతిని బట్టి రెండో దశ ప్రాజెక్టుకు, క్యాప్టివ్ పోర్టుకు భూములు సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సుమారు నాలుగు వేల ఎకరాలు అవసరం అవుతాయని అంచనా వేశారు.

ఏపీ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ పాలసీ 4.0 (2024-29) ప్రకారం.. ఆర్థిక ప్రోత్సాహకాలు, 50 శాతం మూలధన రాయితీ, స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయింపు, పదేళ్లపాటు నీటి సరఫరా, 15 ఏళ్ల పాటు ఈడీ మినహాయింపు, ప్రాజెక్టు నిర్మాణ సమయంలో జీఎస్టీ రీయింబర్స్‌మెంట్, ఇంకా విద్యుత్తు, నీరు, రైలు, రోడ్డు కనెక్టివిటీ, సమీపంలోని క్వారీల వినియోగం, నిబంధనల ప్రకారం ఎన్ఎండీసీతో త్రైపాక్షిక అవగాహన ఒప్పందం కుదుర్చుకున్న తర్వాత ముడి ఖనిజం వినియోగం తదితర ప్రోత్సాహకాలను ప్రభుత్వం ప్రతిపాదించింది.

### అనుబంధంగా పోర్టు

స్టీల్ ప్లాంట్‌కు ముడి సరకు దిగుమతి, ఉక్కు ఉత్పత్తుల ఎగుమతి కోసం కో-టెర్మినస్ క్యాప్టివ్ పోర్ట్ నిర్మాణానికి సముద్ర తీరాన 128 హెక్టార్ల భూమి కావాలని ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా లిమిటెడ్ కోరింది. తొలి దశలో 1.5 కిలోమీటర్ల మేర 5 బెర్తులు, రెండో దశలో 3.8 కిలోమీటర్ల పొడవున 12 బెర్తులు నిర్మించనున్నట్టు ప్రతిపాదనల్లో పేర్కొంది. మొదటి దశలో రూ.5,816 కోట్లు, రెండో దశలో మరో రూ.5,383 కోట్లు కలిపి మొత్తం రూ.11,199 కోట్ల పెట్టుబడితో ఎనిమిది వేల మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపింది. ఈ స్టీల్ ప్లాంట్ ... మిగతా 6వ పేజీలో

## బీఎన్ రోడ్డుకు మోక్షం కల్పించండి

వడ్డాది, విజయరామరాజుపేటల వద్ద వంతెనలు నిర్మించాలి

- గోవాడ షుగర్ ఫ్యాక్టరీని ఆదుకోవాలి
- శాసనసభలో ప్రభుత్వానికి ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు వినతి

చోడవరం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి):



శాసనసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు

తన నియోజకవర్గంలో ప్రధానమైన బీఎన్ రోడ్డును త్వరగా అభివృద్ధి చేసి ప్రయాణికులు, వాహనదారుల ఇబ్బందులు తొలగించాలని చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు శుక్రవారం శాసనసభల్లో ఆర్అండ్‌బీ శాఖ మంత్రికి విజ్ఞప్తి చేశారు. అధ్వానంగా తయారైన ఈ రహదారిలో ప్రయాణం ఇబ్బందికరంగా ఉందని అన్నారు. మరోవైపు వడ్డాది, విజయరామరాజుపేటల వద్ద వంతెనలు కూలిపోయాయని, తాత్కాలికంగా నిర్మించిన కాజ్‌వేల వరద ధాటికి కొట్టుకుపోవడంతో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. విజయరామరాజుపేట కాజ్‌వే వద్ద రెండు రోజుల వ్యవధిలో ఇద్దరు నీటిలో కొట్టుకుపోయి మృతిచెందారని అన్నారు. ఈ రెండుచోట్ల వెంటనే వంతెనలు నిర్మించాలని కోరారు. గోవాడ షుగర్ ఫ్యాక్టరీలో ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని, గత సీజన్‌లో చెరకు సరఫరా చేసిన రైతులకు బకాయిలతోపాటు, కార్మికులకు వేతనాలు చెల్లించడానికి ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తిచేశారు.

## ముసురు.. మోస్తరు వర్షం

నిండిన కల్యాణపులోవ, పెద్దేరు

- గేట్లు ఎత్తి నదుల్లోకి నీరు విడుదల



కల్యాణపులోవ జలాశయం గేట్ల నుంచి నదిలోకి నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

అనకాపల్లి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో నెలకొన్న తీవ్ర అల్పపీడనం ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ముసురు వాతావరణం నెలకొంది. పలు మండలాల్లో మోస్తరు వర్షం కురిసింది. దేవరాపల్లి, చీడికాడ మండలాల్లో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. అనకాపల్లి, చోడవరం, నర్సీపట్నం, మాకవరపాలెం, అచ్యుతాపురం, రాంబిల్లి, ఎలమంచిలి, మునగపాక మండలాల్లో తేలకపాటి జల్లులు పడ్డాయి. శుక్రవారం రాత్రి కూడా దఫదఫాలుగా జల్లులు పడుతూనే వున్నాయి.

### భారీ వర్ష సూచన..కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్

బంగాళాఖాతంలో నెలకొన్న ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా బలపడడంతో రానున్న రెండు రోజులు జిల్లాలో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామని, సహాయం కోసం 08924-222888, 08924-225999, 08924-226599 నంబర్లకు (ల్యాండ్ లైన్లు) ఫోన్ చేయాలని ఆమె ఒక ప్రకటనలో తెలిపారు.

### కల్యాణపులోవ గేట్లు ఎత్తివేత

రావికమతం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్యాణపులోవ జలాశయం నీటిమట్టం గరిష్ఠస్థాయికి చేరుతుం డడంతో అధికారులు ముందు జాగ్రత్త చర్యగా రెండు గేట్లు ఎత్తి అదనపు నీటిని సర్పా నదిలోకి విడిచిపెడుతున్నారు. రిజర్వాయర్ గరిష్ఠ నీటిమట్టం 460 అడుగులు కాగా, పరీవాహక ప్రాంతమైన ఏజెన్సీలో మూడు రోజుల నుంచి వర్షాలు కురుస్తుండడంతో 300 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతున్నది. దీంతో శుక్రవారం సాయంత్రానికి నీటిమట్టం 458.5 అడుగులకు చేరింది. రిజర్వాయర్‌లోకి ఇన్‌ఫ్లో కొనసాగుతుండడంతో రెండు స్పిల్‌వేట్లను ఎత్తి 200 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్టు ఏఈ డి.సూర్య తెలిపారు. అందువల్ల సర్పా నది పక్కనున్న రావికమతం, రోలుగుంట, మాకవరపాలెం మండలాల్లో చీమలపాడు, జడ్.కొత్తపట్నం, గంపవానిపాలెం, కొత్తకోట, కన్నంపేట, జగ్గంపేట, జె.నాయుడుపాలెం, కొమరవోలు, ఆర్.కొత్తూరు, కుసర్లపూడి, తూటిపాల, తాడపాల, కొండ అగ్రహారం గ్రామాల ప్రజల అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు.

### పెద్దేరు నుంచి 300 క్యూసెక్కులు..

మాడుగుల రూరల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్దేరు జలాశయంలోని వరద ప్రవాహం శుక్రవారం కూడా కొనసాగింది. గరిష్ఠ నీటిమట్టం 137 మీటర్లుకాగా ఎగువనున్న ఏజెన్సీ ప్రాంతంలో వర్షాలు కురుస్తుండడంతో 370 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతున్నది. దీంతో శుక్రవారం సాయంత్రం నీటిమట్టం 136.4 మీటర్లకు చేరింది. ముందు జాగ్రత్త చర్యగా రాత్రి ఎనిమిది గంటలకు మూడో నంబరు గేటు ఎత్తి 300 క్యూసెక్కుల నీటిని నదిలోకి విడిచిపెడుతున్నట్టు జలాశయం ఏఈ సుధాకరరెడ్డి చెప్పారు. పెద్దేరు నది పక్కన వున్న మాడుగుల, బుచ్చెయ్యపేట, చోడవరం మండలాల ప్రజలు అప్రమత్తంగా వుండాలని ఆయన సూచించారు.



దుర్గమాంబ అమ్మవారిని కరెన్సీ నోట్లతో మహాలక్ష్మీదేవిగా అలంకరించిన దృశ్యం

## మహాలక్ష్మిదేవి అలంకరణలో దుర్గాదేవి

లంకెలపాలెం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మహా విశాఖ నగరపాలక సంస్థ (జీవీఎంసీ) 79వ వార్డు పరిధి లంకెల పాలెంలోని దుర్గమాంబ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారిని మహాలక్ష్మీదేవీగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని రూ.1.4 లక్షల విలువ చేసే కరెన్సీ నోట్లతో తో అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి వచ్చి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

## ఆర్ఈసీఎస్‌లో అవినీతిపై విజిలెన్స్ దర్యాప్తు చేపట్టాలి

- శాసనసభలో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ డిమాండ్

కశింకోట, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి):



శాసనసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

అనకాపల్లి గ్రామీణ విద్యుత్ సహకార సంఘం (ఆర్ఈసీఎస్)లో జరిగిన అవినీతిపై విజిలెన్స్ దర్యాప్తు చేయాలని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం శాసనసభలో ఆయన మాట్లాడుతూ, అవినీతిని నివారించాలనే ఉద్దేశంతో 2021లో ఆర్ఈసీఎస్‌ను ఈపీడీసీఎల్‌కు అప్పగించారని, కానీ అవినీతి మాత్రం కొనసాగుతూనే ఉందని ఆరోపించారు. ఆర్ఈసీఎస్ పాలిటెక్నికల్ కళాశాలలో ఉన్న రూ.3 కోట్ల నిధులను అప్పట్లో ఈపీడీసీఎల్‌కు అప్పగించారని, కానీ గత ఎనిమిది నెలల నుంచి కళాశాల ఉద్యోగులకు జీతాలు చెల్లించడం లేదన్నారు. మరోవైపు ఆర్ఈసీఎస్‌లో రిటైర్ అయిన ఉద్యోగులకు ఇప్పటికీ జీతాలు చెల్లిస్తున్నారని చెప్పారు. ఆర్ఈసీఎస్‌ను సహకార సంస్థగా లేదంటే పూర్తిగా ఈపీడీసీఎల్ ఆధీనంలో నడిచేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## డీఎస్సీలో మహిళలదే పైచేయి

ఉమ్మడి జిల్లాలో ఉపాధ్యాయులుగా ఎంపికైనవారు 1,268

- మహిళలు 718, పురుషులు 550 మంది
- మొత్తంగా చూస్తే నర్సీపట్నం నియోజకవర్గం నుంచి అత్యధికంగా 171 మంది ఎంపిక
- అతి తక్కువగా విశాఖ నార్త్ నుంచి నలుగురు..



అమరావతిలో విద్యా శాఖ అధికారుల చేతుల మీదుగా ఉపాధ్యాయ నియామక పత్రాన్ని అందుకుంటున్న అచ్యుతాపురం మండలం తిమ్మరాజుపేట గ్రామానికి చెందిన కర్రి దివ్య

విశాఖపట్నం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ ద్వారా ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిలో మహిళలే అధికం. మొత్తం 1,268 మందిలో 718 మంది (56.62 శాతం) మహిళలు కాగా 550 మంది (43.33 శాతం) పురుషులు ఉన్నారు. జడ్పీ, ప్రభుత్వ, మునిసిపల్, గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్జీటీ)గా 574 మంది ఎంపిక కాగా అందులో 382 మంది మహిళలు. అలాగే ఏజెన్సీలో గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో 335 పోస్టులకుగాను 239 మంది మహిళలు ఎంపికైనట్టు విద్యా శాఖ వర్గాలు తెలిపాయి. స్కూల్ అసిస్టెంట్ కేటగిరీలో వ్యాయామ, గణితం, ఫిజికల్ సైన్స్, సోషల్ స్టడీస్‌లో మినహా మిగిలిన వాటిల్లో పురుషుల కంటే మహిళలు ఎక్కువగా ఎంపికయ్యారు. దాదాపు అన్ని కేడర్‌లలో టాప్ ర్యాంకర్లు మహిళలు కావడం గమనార్హం.

ఉమ్మడి జిల్లాలో జిల్లా పరిషత్, ప్రభుత్వ, మునిసిపల్, జువెనైల్, గిరిజన సంక్షేమ శాఖల్లో మొత్తం 1,139 పోస్టులకుగాను 1,134 పోస్టులు భర్తీ కాగా, బీసీ, ఎస్సీ సంక్షేమ శాఖ పరిధిలోని ... మిగతా 6వ పేజీలో

## వారపు సంతలకు దసరా తాకిడి

నాటుకోళ్లు, గొర్రెలు, మేకలను తీసుకువచ్చిన అమ్మకందారులు

- పండుగ కావడంతో అధిక గిరాకీ
- సాధారణ రోజులతో పోలిస్తే 20 శాతం మేర పెరిగిన ధరలు



అచ్యుతాపురం సంతలో గొర్రెలు, మేకలు

అచ్యుతాపురం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వచ్చే వారం దసరా పండుగ నేపథ్యంలో అచ్యుతాపురం, మోసయ్యపేటలో సంతలు శుక్రవారం నాటుకోళ్ల, గొర్రెలు, మేకల క్రయవిక్రయదారులతో రద్దీగా మారాయి. దసరా పండుగ రోజున మాంసాహార వంటకాలు చేసుకోవడం ఆనవా యితీ. దీంతో నాటుకోళ్ల, మేకలు, గొర్రెలకు గిరాకీ ఏర్పడుతుంది. వీటి పెంపకందారులు మంచి ధర లభిస్తుందన్న ఉద్దేశంతో దసరా పండుగ సమ యంలో సంతలకు తీసుకువచ్చి విక్రయిస్తుంటారు. కొనుగోలుదారులు సైతం సంతల్లో సరసమైన ధరలకు లభిస్తాయన్న భావంతో వస్తుంటారు. శుక్రవారం అనకాపల్లి జిల్లాతోపాటు విశాఖ, విజయనగరం, కాకినాడ జిల్లాల నుంచి మేకలు, గొర్రెల కొనుగోలుదారులు వచ్చారు. సాధారణ రోజులతోపోలిస్తే నాటుకోళ్ల, జీవాల ధరలు 15 నుంచి 20 శాతం వరకు పెరిగాయి. సుమారు 20 కిలోల బరువున్న గొర్రెపోతు రూ.12 వేల నుంచి రూ.14 వేల వరకు ధర పలికింది. అదే విధంగా రెండు కిలోల బరువున్న నాటుకోళ్లను అటుఇటుగా రూ.2 వేలకు విక్రయించారు.

# పట్టలేని 'సంతోష'ం

▸ కృషి, పట్టుదలతో ఉపాధ్యాయ ఉద్యోగం సాధించిన ఎలమంచిలి మహిళ

▸ ఇప్పటి వరకు గ్రామ సచివాలయ మహిళా పోలీస్‌గా విధులు



డీఈవో నుంచి నియామక పత్రాన్ని అందుకుంటున్న సంతోషకుమారి

ఎలమంచిలి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయ మహిళా పోలీస్ ఉద్యోగం చేస్తున్న ఆమె ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగాన్ని పట్టుదలతో సాధించి, తన లక్ష్యాన్ని నెరవేర్చుకున్నారు. గురువారం అమరావతిలో జరిగిన కార్యక్రమంలో డీఎస్సీ-2025 నియామక పత్రాన్ని ఆనందోత్సాహంతో అందుకున్నారు. ఎలమంచిలి మునిసిపాలిటీ సోమలింగపాలెం ప్రాంతానికి చెందిన కర్రి సంతోషకుమారి ఇంటర్ వరకు ఎలమంచిలిలోనే చదివారు. ఓపెన్ యూని వర్సిటీ ద్వారా డిగ్రీ (బీఏ తెలుగు), పాయకరావుపేట శ్రీప్రకాశ్‌లో బీఈడీ పూర్తి చేశారు. 2019లో గ్రామసచివాలయ మహిళా పోలీస్‌గా ఉద్యోగం సాధించారు. ప్రస్తుతం రాంబిల్లి మండలం దిమిలిలో విధులు నిర్వహిస్తున్నారు. మరోవైపు ఉపాధ్యాయ ఉద్యోగం కోసం తీవ్రంగా కష్టపడ్డారు. ఈ ఏడాది నిర్వహించిన డీఎస్సీలో స్కూలు అసిస్టెంట్(తెలుగు)విభాగంలో 15వ ర్యాంకు, పీజీటీలో 40వ ర్యాంకు, టీజీటీలో 82వ ర్యాంకు సాధించారు. ఎస్ఏ, పీజీటీ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. భర్త మెహర్ చిరుద్యోగి, కుమార్తె, కుమారుడు బీటెక్ చవుతున్నారు. కృషి, పట్టుదలతోపాటు కుటుంబ సభ్యుల సహకారంతో టీచర్ ఉద్యోగం సాధించినట్టు సంతోషకుమారి చెప్పారు.

## 'పల్లె ప్రగతికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం'



కాలువల నిర్మాణానికి శంకుస్థాపనలో వెంకట సతీష్ కుమార్, డ్రీమ్స్ నాయుడు

అచ్యుతాపురం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : పల్లె ప్రగతిని కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని జనసేన పార్టీ ఉత్తరాంధ్ర వ్యవహారాల ప్రతినిధి సుందరపు వెంకట సతీష్ కుమార్ అన్నారు. మండలంలోని రామన్నపాలెంలో చేపట్టనున్న కాలువల పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. గ్రామాల్లో పారిశుధ్య సమస్య పరిష్కారానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్టు చెప్పారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో తీర్చిదిద్దేందుకు ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ కృషి చేస్తున్నారన్నారు. ఇందుకు అన్నివర్గాల ప్రజలు బాసటగా నిలవాల్సిందిగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు బైలపూడి శ్రీరామదాసు, కె.చిన్నారావు, సర్పంచ్ డ్రీమ్స్ నాయుడు, ఎంపీటీసీ సభ్యుడు లాలం శ్రీనివాసరావు, ద్వారపురెడ్డి బాపూజీ, పిన్నమరాజు వాసు, డీఎస్ఎన్ రాజు, రాజాన విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# నీటి సరఫరాలో నిర్లక్ష్యం చూపరాదు

▸ సిబ్బందికి జడ్పీ సీఈవో నారాయణమూర్తి ఆదేశం ▸ వాడ్రాపల్లిలో పర్యటన



నీటి సమస్యపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారిణి వివరణ కోరుతున్న జడ్పీ సీఈవో

మునగపాక, సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి) : పల్లెల్లో తాగునీటి సరఫరాలో ఎటు వంటి నిర్లక్ష్యం చూపరాదని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి నారాయణమూర్తి అన్నారు. మండలంలోని వాడ్రాపల్లిలో శుక్రవారం ఆయన విస్తృతంగా పర్యటించారు. ఈసందర్భంగా పలు వీధుల్లో, పలువురు ఇళ్ల వద్దకు వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. పల్లెలను పరిశుభ్రంగా ఉంచాలని పారిశుధ్య సిబ్బందిని ఆదేశించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతకు అంతా అధిక ప్రాధాన్యం ఇవ్వాలని గ్రామస్థులకు సూచించారు. ఆయా ప్రాంతాల్లో చేపట్టాల్సిన పనులను పలువురు వివరించారు. అనంతరం మరమ్మతులకు గురైన రక్షిత నీటి పథకం ట్యాంక్‌ను పరిశీలించారు. గ్రామంలో సమస్యలను జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి మళ్ల వరహా నర్సింగరావు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.ఉషా రాణి, సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## నాగులాపల్లి పీఏసీఎస్ లాభాల బాట

▸ త్వరలో సభ్యులకు 15 శాతం బోనస్

▸ చైర్‌పర్సన్ యల్లపు వెంకట భాస్కరరావు

మునగపాక, సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి) : నాగులాపల్లి పీఏసీఎస్ వార్షిక నికర లాభం రూ.56 లక్షలు ఆర్జించిందని చైర్ పర్సన్ యల్లపు వెంకట భాస్కరరావు తెలిపారు. నాగులాపల్లి పీఏసీఎస్ సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.36 కోట్ల మేర టర్నోవర్ జరిగినట్టు చెప్పారు. షేరు ధనంపై సభ్యులకు 15 శాతం బోనస్ పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఇందుకు సహకరించిన సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పూర్వపు అధ్యక్షులు మళ్ల ఉమామహేశ్వరరావు, వేగి సోమేశ్వరరావులను సత్కరించారు. సీఈవో మళ్ల స్వామి వార్షిక నివేదికను చదివారు. ఈ కార్యక్రమంలో పర్సన్‌లు సుందరపు శ్రీనివాసరావు, కొంతం జగదీశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

## ట్యాంకర్ నుంచి ఆయిల్ చోరీ

▸ నలుగురిపై పోలీసులు కేసు నమోదు



ఆయిల్ స్వాధీనం చేసుకున్న పోలీసులు

ఎలమంచిలి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ట్యాంకరు నుంచి ఆయిల్ చోరీ చేస్తున్న నలుగురిపై కేసు నమోదు చేసినట్టు రూరల్ పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జ్ ఎస్ఐ సావిత్రి తెలిపారు. మండలంలోని సోమన్నపాలెం సమీపంలో ప్రధాన రహదారి పక్కన శుక్రవారం ఉదయం ఎస్.రాయవరం మండలం వొమ్మవరం గ్రామానికి చెందిన షేక్ జానీ ఆధీనంలో ఉన్న షెడ్డు వద్ద ట్యాంకర్ లారీ నుంచి డీజిల్ చోరీ చేస్తున్నట్టు అందిన సమాచారంపై సిబ్బందితో కలిసి దాడి చేశామన్నారు. ఈ సందర్భంగా నలుగురు వ్యక్తులను పట్టుకుని వారి నుంచి 20 లీటర్ల డీజిల్, 50 లీటర్ల పెట్రోలు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. అనంతరం వారిపై కేసు నమోదు చేశామన్నారు.

# మోతాదు మేరకే పురుగు మందుల పిచికారీ



రైతులకు సూచనలిస్తున్న ఏవో మోహన్‌రావు

ఎలమంచిలి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీ పరిధి కొత్తపాలెంలో వరి పంట పొలాలను మండల వ్యవసాయాధికారి మోహన్‌రావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులనుద్దేశించి మాట్లాడుతూ పురుగుమందులను అవసరం మేరకు మాత్రమే పిచికారీ చేయాలన్నారు. మండల వ్యాప్తంగా ఇప్పటి వరకు ఐదు వేల ఎకరాల్లో నాట్లు పూర్తయ్యాయన్నారు. మరికొన్ని ప్రాంతాల్లో నాటు పడాల్సి ఉందన్నారు. త్వరలో పూర్తి కానున్నట్టు వెల్లడించారు. అనంతరం పలువురు రైతుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి అరుణ, రైతులు పాల్గొన్నారు.

**నారాయణపురంలో....**

రాంబిల్లి : మండలంలోని నారాయణపురం గ్రామంలో పంట పొలాలను మండల వ్యవసాయాధికారిణి సి.సుమంత పరిశీలించారు. రైతు దొడ్డ లక్ష్మీనరసింహారావు పొలంలో నారో యూరియాను దశ పర్ణికాషాయంతో కలిపి డ్రోన్ ద్వారా పిచికారీ చేశారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ డ్రోన్ ద్వారా పురుగు మందులు పిచికారీ చేయడం వలన కూలీల ఖర్చు, సమయం ఆదా అవుతాయన్నారు. పై మందు, ఆకుముడత, కాండం తొలుచు పురుగు, సుడిదోమ, పాముపొడ తెగులు తదితరాల నివారణకు పనిచేస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఈవో రాజ్‌కుమార్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

### వీధి వ్యాపారుల అభ్యున్నతికే

# లోక్ కల్యాణ్ మేళా : చైర్‌పర్సన్



లోక్ కల్యాణ మేళాలో మాట్లాడుతున్న మునిసిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి

ఎలమంచిలి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : లోక్ కల్యాణ్ మేళా ద్వారా అందించే రుణాలను పట్టణ వీధి వ్యాపారులంతా సద్వినియోగం చేసుకుని, తద్వారా ఆర్థిక ప్రగతి సాధించాలని మునిసిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి అన్నారు. మెప్మా ఆధ్వర్యంలో శుక్రవారం వీధి వ్యాపారుల కోసం లోక్ కల్యాణ్ మేళాను బ్యాంకర్లతో కలిసి ఇక్కడ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వీధి వ్యాపారుల ఆర్థికాభ్యున్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయన్నారు. ఇందులో భాగంగా బ్యాంకులు అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. ముఖ్యంగా మరింత మందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. మెప్మా సిటీ మేనేజర్ (సీఎంఎం) పద్మావతి మాట్లాడుతూ వీధి వ్యాపారులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు బాసటగా నిలుస్తున్న బ్యాంకర్లను ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు అధికారులు, మెప్మా పీపీఎం వరలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

## అసెంబ్లీలో ఎమ్మెల్యే బాలకృష్ణ వ్యాఖ్యలు సరికావు

▸ బొడ్డేడ ప్రసాద్

మునగపాక, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : అసెంబ్లీలో ఎమ్మెల్యే బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలు సభా సాంప్రదాయాలకు విరుద్ధంగా ఉన్నాయని వైసీపీ అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్ అన్నారు. ఇక్కడి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చిరంజీవి, జగన్‌మోహన్‌రెడ్డిలపై అసెంబ్లీలో బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలు సరికావన్నారు. ఈ సమావేశంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

## ఆవలో నీటి నిల్వలు ఉండేలా చర్యలు తీసుకోవాలి

▸ వైసీపీ రాష్ట్ర కార్యదర్శి చిక్కాల రామారావు



ఇరిగేషన్ ఏఈతో మాట్లాడుతున్న వైసీపీ నేత చిక్కాల రామారావు తదితరులు

పాయకరావుపేట, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రానున్న రోజుల్లో వర్షాలు పడకుంటే సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా మండలంలోని గోపాపట్నం ఆవలో నీటి నిల్వలు ఉండేలా చర్యలు తీసుకోవాలని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి చిక్కాల రామారావు ఇరిగేషన్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆయన ఆధ్వర్యంలో పలువురు సర్పంచ్‌లు, రైతులు ఇరిగేషన్ కార్యాలయంలో ఏఈ వినయ్‌కుమార్‌ను కలిశారు. ఈ సందర్భంగా చిక్కాల మాట్లాడుతూ మండలంలోని మంగవరం కాలువ గేట్లు కిందికి దించి ఉంచడం వల్ల నదిలో నీరు సముద్రంలోకి వృథాగా పోతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ఆవ గర్భంలో నీటి నిల్వలు తగ్గి రానున్న రోజుల్లో వర్షాలు పడకుంటే ఆవ దిగువాయకట్టు భూములకు సాగునీటి సమస్య తలెత్తే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికైనా మంగవరం కాలువ గేట్లు ఎత్తి ఆవలోని సమృద్ధిగా నీరు వచ్చేలా చర్యలు చేపట్టాలని ఏఈని కోరారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల అధ్యక్షుడు గెడ్డమూరి శ్రీనివాసరావు, సర్పంచులు పన్నీరు బాబ్జీ, కోడ కోటేశ్వరరావు, నాయకులు వంగలపూడి రామారావు, మేడిశెట్టి రామగోవిందు, చేపల తాతాజీ, యజ్జల అన్నవరం తదితరులు పాల్గొన్నారు.

# మిట్టల్ స్టీల్ ప్లాంట్‌తో అభివృద్ధికి ఆస్కారం

జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేశ్

నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో పీఎం, సీఎం, డిప్యూటీ సీఎం, ఎంపీ, మంత్రుల ఫొటోలకు పాలాభిషేకాలు



పాయకరావుపేట: పీఎం, సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు పాలాభిషేకం

పాయకరావుపేట, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మిట్టల్ స్టీల్ ప్లాంట్ రాకతో పాయకరావుపేట నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేందుకు ఆస్కారం ఉందని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేశ్ అన్నారు. మిట్టల్ స్టీల్ ప్లాంట్ రాక సందర్భంగా శుక్రవారం పాయకరావుపేటలో కూటమి నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ పీఎం, సీఎం, డిప్యూటీ సీఎం, ఎంపీ, మంత్రుల ఫొటోలకు పాలాభిషేకం నిర్వహించి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా తోట నగేశ్ మాట్లాడుతూ ఇప్పటికే పలు పరిశ్రమలు ఏర్పాటైన పాయకరావుపేట నియోజకవర్గంలో, రానున్న రోజుల్లో రూ.1.85 లక్షల కోట్లతో స్టీల్ ప్లాంట్ రావడం వల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా 80 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. అలాగే పాయకరావుపేటకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మంచి పేరు వస్తుందన్నారు. ఇందుకు విశేష కృషిచేసిన రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, ఎంపీ సీఎం రమేశ్, పీఎం నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పెదిరెడ్డి చిట్టిబాబు, చించెలపు పద్దు, వై.వరహాలబాబు, పి.శ్రీను, కె.వెంకటేశ్వరరావు, ఎం.నారాయణరావు, జి.శ్రీనివాసరావు, శ్రీరంగం రమేశ్, ఎం.రమాకుమారి, ఆచంట దొర పాల్గొన్నారు.



కోటవురట్ల: పీఎం, సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు పాలాభిషేకం

**ఎస్.రాయవరంలో...**

ఎస్.రాయవరం: స్టీల్ ప్లాంట్ ప్రజాభిప్రాయ సేకరణకు మద్దతుగా కూటమి నాయకులు శుక్రవారం సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులు, ఎంపీ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు, మాజీ ఎంపీపీ వినోద్‌రాజు, పీఏసీఎస్ చైర్మన్ గుర్రం రామకృష్ణ, మండల కార్యదర్శి అల్లు నరసింహమూర్తి, మాజీ సర్పంచ్ గోవిందు, కురందాసు శ్రీను, పల్లెల బుజ్జి, కోన అప్పలరాజు, అప్పలకొండ, లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

**కోటవురట్లలో...**

కోటవురట్ల: మండలంలోని టీకేపల్లి గ్రామంలో టీడీపీ మండల అధ్యక్షుడు పెట్ల లింగంనాయుడు ఆధ్వర్యంలో ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, హోంమంత్రి అనిత, ఎంపీ సీఎం రమేశ్ చిత్రపటాలకు పాలాభిషేకం నాయకులు, కార్యకర్తలు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షులు వేచలపు జనార్దన్, డైరెక్టర్లు బాబ్జి, నాయకులు కనకరాజు, పి.సూర్యరావు, తిరుమలరావు పాల్గొన్నారు.

## సప్పరంపై శ్రీనివాసుడు

నక్కపల్లి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉపమాక క్షేత్రంలో శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఇత్తడి సప్పరం వాహనంపై శ్రీనివాసుడి తిరువీధి సేవ ఘనంగా జరిగింది. ఉభయదేవేరులతో కూడిన స్వామివారి ఉత్సవమూర్తులను సప్పరం వాహనంపై అలంకరించి అర్చకులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మహిళల కోలాట ప్రదర్శనలు, మంగళవాద్యాల నడుమ శ్రీనివాసుడి ఊరేగింపు ఎంతో వైభవంగా సాగింది. అధిక సంఖ్యలో భక్తులు మాడవీధుల్లో ఊరేగిన సర్వాంతర్యామిని దర్శించుకున్నారు. అంతకుముందు కొండపైన, కింద వున్న ఆలయాల్లో అర్చకులు నిత్య హోమాలు, పూజలు నిర్వహించారు.



ఇత్తడి సప్పరం వాహనంపై స్వామివారి తిరువీధి సేవ

## మత్స్యకారుల వినూత్న నిరసన



కళ్లు మూసుకుని నిరసన తెలుపుతున్న మత్స్యకారులు

నక్కపల్లి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): బల్క్‌డ్రగ్ పార్కుకు వ్యతిరేకంగా రాజయ్యపేట గ్రామంలో మత్స్యకారులు చేపడుతున్న నిరసన దీక్ష శుక్రవారం నాటికి 13వ రోజుకు చేరుకుంది. స్థానిక నూకతాత ఆలయం వద్ద మత్స్యకారులు, సీపీఎం నాయకులు చేతులతో కళ్లు మూసుకుని వినూత్నంగా నిరసన తెలిపారు. బల్క్‌డ్రగ్ పార్కు ఏర్పాటును విరమించుకోవాలని మత్స్యకారులు డిమాండ్ చేశారు. భవిష్యత్తు తరాల ప్రజల ప్రాణాలు, పర్యావరణాన్ని కాపాడేందుకు ఈ పోరాటం చేస్తున్నామని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. ఈ ఆందోళనలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు, సీపీఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యులు కె.జనార్దన్, తుని ఏరియా నాయకులు వాడబోయిన శివ, వై.నాగేశ్, కాశీ, బాపూజీ, సోమేశ్వరరావు, పైడితల్లి, తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితాల్లో తప్పులు గుర్తించండి

పాయకరావుపేట, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పాత, కొత్త ఓటర్ల జాబితాల్లో తప్పులు గుర్తించాలని తహశీల్దార్ ఎస్‌ఏ.మహేశ్ ఆదేశించారు. తన కార్యాలయంలో శుక్రవారం సచివాలయాల ఉద్యోగులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని అన్ని పంచాయతీల ఓటర్ల జాబితాల్లో వివరాలు గుర్తించడంపై సూచనలు చేశారు. పెరిగిన ఓటర్ల వివరాల నివేదిక రూపొందించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ త్రినాథ్ పాల్గొన్నారు.

## ఘనంగా బుజ్జి జన్మదిన వేడుకలు

నక్కపల్లి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక పీఏసీఎస్ చైర్‌పర్సన్ కొప్పిశెట్టి బుజ్జి జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. నక్కపల్లి సొసైటీ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో కూటమి నాయకులు కొప్పిశెట్టి వెంకటేశ్, లాలం కాశీనాయుడు, చించలపు పద్దు, వైబోయిన రమణ, అబద్ధం, కురందాసు నూకరాజు, కొప్పిశెట్టి కొండబాబు, గింజాల లక్ష్మణరావు, కోసూరి శ్రీను, వెలగా శ్రీను తదితరులు బుజ్జికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీడీవో సీతారామరాజు, డిప్యూటీ ఎంపీడీవో చలపతిరావు సహా పలువురు అధికారులు బుజ్జిని సత్కరించారు.

## ప్రజలకు స్వచ్ఛమైన నీరు ఇవ్వండి

నక్కపల్లి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజారోగ్యానికి స్వచ్ఛమైన నీటిని అందించాలని ఎంపీడీవో డి.సీతారామరాజు, డిప్యూటీ ఎంపీడీవో చలపతిరావు సూచించారు. మండలంలోని సీహెచ్ఎల్ పురం గ్రామంలో శుక్రవారం వారు పర్యటించారు. మంచినీటి ట్యాంకు క్లోరినేషన్ పనులను పరిశీలించారు. తడి, పొడిచెత్త ఏరివేతను తనిఖీ చేశారు. సచివాలయ ఉద్యోగులతో మాట్లాడారు. క్రమం తప్పకుండా మంచినీటి ట్యాంకుల క్లోరినేషన్ చేయాలని సూచించారు.

## ఇందిరా కాలనీలో వైద్య శిబిరం

పాయకరావుపేట, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇందిరా కాలనీలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. పాయకరావుపేట పీహెచ్‌సీ వైద్యులు పలువురు మహిళలకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. అలాగే రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ విలియంకేరి గుడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు కె.సత్తిబాబు, టి.లోవరాజు, వై.దురా ప్రసాద్, కె.ప్రసాద్, పి.ప్రసాద్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

**కోటవురట్ల:** మండల కేంద్రంలోని రాట్నాలపాలెం సచివాలయం వద్ద శుక్రవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కె.వెంకటాపురం పీహెచ్‌సీ వైద్యులు ప్రత్యూష్, ధనలక్ష్మి మహిళలు, బాలికలకు రక్త పరీక్షలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.అనిల్‌కుమార్, ఎంపీటీసీ సభ్యుడు వి.రాంబాబు, వైద్య సిబ్బంది బుల్లిబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఆలయాల్లో కుంకుమ పూజలు



దార్లపూడిలో దుర్గమ్మకు పూజలు చేస్తున్న భక్తులు

ఎస్.రాయవరం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దార్లపూడి గ్రామంలో దుర్గాదేవి మండపం వద్ద శుక్రవారం కమిటీ సభ్యులు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## స్టీల్ ప్లాంట్‌కు తొలి అడుగు

... 5వ పేజీ తరువాయి

ఏర్పాటైతే రాష్ట్రంలో భారీ ప్రాజెక్టుగా నిలుస్తుంది. ఉక్కు పరిశ్రమకు అనుబంధంగా చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఏర్పాటుతో మరికొన్ని వేల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

**ప్రజాభిప్రాయ సేకరణకు ఏర్పాట్లు పూర్తి**

స్టీల్‌ప్లాంట్ నిర్మాణానికి కాలుష్య నియంత్రణ మండలి, పర్యావరణ అనుమతులకు సంబంధించి శనివారం చందనాడ శివారు పాటిమీద గ్రామంలో ప్రజాభిప్రాయ సేకరణ జరగనుంది. ఇందుకోసం అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. విశాలమైన సభావేదికను నిర్మించారు. పటిష్ఠమైన ఐరన్ గ్రిల్స్ ఏర్పాటు చేశారు. 400 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. నర్సీపట్నం డీఎస్పీ పి.శ్రీనివాసరావు శనివారం రాత్రి ఇక్కడకు వచ్చి సభా వేదికను పరిశీలించారు. బందోబస్తుకు సంబంధించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట సీఐ కె.కుమారస్వామి వున్నారు.

## పర్యాటక ప్రగతి అంతంతే!

... 5వ పేజీ తరువాయి

పెంటకోట, రాజ వరం ప్రాంతాలకు పర్యాటకులు అధిక సంఖ్యలో వస్తుంటారు. కార్తీక పౌర్ణమి, శివరాత్రి పర్వదినాల్లో ఈ ప్రాంతాల్లో భక్తులు పుణ్యస్నానాలు ఆచరిస్తుంటారు. ముత్యాలమ్మపాలెం, తంతడి, పూడిమడక, రేవుపోలవరం ప్రాంతాల్లో సినిమా షూటింగ్‌లు కూడా జరుగుతుంటాయి. కానీ ఒక్కచోట కూడా తాగునీరు, మరుగుదొడ్లు, సేద తీరేందుకు నీడ వంటి కనీస సదుపాయాలు లేవు. సముద్ర తీరంలో మొత్తం 35 ప్రదేశాలను గుర్తించిన అధికారులు పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని భావించారు. కానీ ఇంతవరకు కార్యరూపం దాల్చలేదు.

**కొండకర్ల ఆవ.**

కొండకర్ల ఆవ సహజసిద్ధ అందాలకు నిలయం. సుమారు 1800 ఎకరాల్లో విస్తరించి వున్న ఈ ఆవ.. రాష్ట్రంలో కొల్లేరు తరువాత అతిపెద్ద మంచినీటి సరస్సుగా ప్రసిద్ధి చెందింది. శీతాకాలంలో ఇక్కడకు వివిధ దేశాల నుంచి రకరాల పక్షులు వస్తుంటాయి. ఆవ అందాలను తిలకించేందుకు పర్యాటకులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. ఇక్కడ కూడా సదుపాయాలు అంతంతమాత్రంగానే వున్నాయి. ఆవలో విహరించడానికి అరకొరగా నాటు పడవలు మాత్రమే వున్నాయి. కొండకర్ల ఆవ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని ప్రభుత్వాలు చెబుతున్నప్పటికీ కార్యరూపం దాల్చడంలేదు.

## డీఎస్సీలో మహిళలదే పైచేయి

... 5వ పేజీ తరువాయి

గురుకులాల్లో 134 మందిని ఎంపిక చేశారు. నియోజకవర్గాల వారీగా ఎంతమంది ఎంపికయ్యారనే వివరాలను విద్యా శాఖ రూపొందించింది. అన్ని కేడర్లలో కలిసి అత్యధికంగా నర్సీపట్నం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 174 అభ్యర్థులు ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. ఆ తరువాత పాయకరావుపేట నియోజకవర్గం నుంచి 147 మంది, చోడవరంనుంచి 145 మంది, భీమిలి నియోజకవర్గంలో 132, మాడుగులలో 130 మంది, విశాఖపట్నం పశ్చిమ నుంచి 77 మంది, ఎలమంచిలి, అరకు నియోజకవర్గాల నుంచి 61 మంది చొప్పున, గాజువాక నుంచి 57 మంది, అనకాపల్లి, పెందుర్తి నియోజకవర్గాల నుంచి 49 మంది చొప్పున, విశాఖపట్నం తూర్పు నుంచి 28 మంది, విశాఖపట్నం సౌత్ నుంచి 25 మంది, అతి తక్కువగా విశాఖపట్నం ఉత్తర నియోజకవర్గం నుంచి నలుగురు ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. ఇతర జిల్లాల నుంచి నాన్‌లోకల్ కోటాలో 93 మంది ఎంపికయ్యారు. కాగా ఉపాధ్యాయులుగా నియామక పత్రాలు అందుకున్న వారికి వచ్చే నెల మూడో తేదీ నుంచి శిక్షణ ఇస్తామని డీఈవో ఎస్.ప్రేమ్‌కుమార్ తెలిపారు.

# పారిశ్రామిక భద్రతకు తొలి ప్రాధాన్యం

▸▸ కలెక్టర్ విజయకృష్ణన్ ▸▸ ప్రమాదకర సంస్థల్లో భద్రతా ప్రమాణాలను ఆడిట్ బృందం తనిఖీ చేస్తున్నట్టు వెల్లడి



కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : పారిశ్రామిక భద్రతను తొలి ప్రాధాన్యంగా పరిగణిస్తూ, ప్రమాదకర పరిశ్రమలలో భద్రతా ప్రమాణాలను తనిఖీ చేసేందుకు ఆడిట్ బృందం పర్యటిస్తున్నట్లు కలెక్టర్ విజయకృష్ణన్ తెలిపారు. ఇక్కడి కలెక్టరేట్‌లో శుక్రవారం 'కార్మికులు, పారిశ్రామిక భద్రత'పై పరిశ్రమలు, కాలుష్య నియంత్రణ, కార్మిక, అగ్నిమాపక, విద్యుత్, డ్రగ్స్ కంట్రోల్ శాఖలు, పరిశ్రమల యాజమాన్యాల ప్రతినిధులతో ఏర్పాటైన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ బృందం పరిశ్రమలలో అమలు చేస్తున్న భద్రతా ప్రమాణాలు, అత్యవసర పరిస్థితుల నిర్వహణ, కార్మికుల భద్రతా శిక్షణలు, పర్యావరణ రక్షణ చర్యలు వంటి అంశాలను సమగ్రంగా పరిశీలన చేస్తుందన్నారు. నేటి వరకు 179 పరిశ్రమలను ఈ బృందం పరిశీలించిందని, వీటిలో కొన్నింట లోపాను గుర్తించడంతో ఆయా శాఖల ద్వారా నోటీసులు జారీ చేసినట్టు చెప్పారు. ఈ నోటీసులు అందుకున్న పరిశ్రమలు సదరు లోపాలను సరిదిద్దుకుని, సరైన భద్రత ప్రమాణాలు పాటిస్తున్నదీ లేని సదరు బృందం పరిశీలన జరపాలని ఆమె ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా కాలుష్య నియంత్రణ మండలి ఈఈ ముకుందరావు పాల్గొన్నారు.

## జీఎస్టీ సంస్కరణలపై విస్తృత ప్రచారం

అనకాపల్లి కలెక్టరేట్ : జీఎస్టీ సంస్కరణలు, వాటి ప్రయోజనాలపై విస్తృత ప్రచారం కల్పించాలని కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి వాణిజ్య పన్నులు, వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి, పశు సంవర్ధక శాఖ, మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2017 సంవత్సరంలో అమలులోకి వచ్చిన జీఎస్టీలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సభ్యులుగా ఉంటూ 56వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశం ద్వారా అతి పెద్ద సంస్కరణలు అమలులోనికి వచ్చాయని తెలిపారు. నాలుగు శ్లాబులలో గల పన్ను విధానాన్ని రెండు శ్లాబులకు కుదిస్తూ, 12 శాతం శ్లాబులో ఉన్న 99 శాతం వస్తువులు, సేవలను ఐదు శాతానికి తగ్గించడం జరిగిందన్నారు. 28 శాతం శ్లాబులో గల 90 శాతం వస్తువులు, సేవలను 18 శాతం శ్లాబ్‌కు తగ్గించినట్టు చెప్పారు. దీనివలన ప్రజలకు కలిగిన ప్రయోజనం తెలిపే నిమిత్తం సెప్టెంబరు 25వ తేదీ నుంచి అక్టోబరు 19వ తేదీ వరకు ప్రత్యేక ప్రచారం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ సమావేశంలో జేసీ ఎం.జాహ్నవి పాల్గొన్నారు.

## 'కౌలు రైతులకు త్వరితగతిన రుణాలు'


అనకాపల్లి కలెక్టరేట్ : కౌలు రైతులకు సూర్యఘర్ సోలార్ రూఫ్ టప్‌నకు, పరిశ్రమలకు, వ్యవసాయ, డెయిరీ, పౌల్ట్రీ, ఉపాధి రంగాలకు, స్వయం సహాయక బృందాలకు త్వరతగతిన రుణాలు మంజూరు చేయాలని బ్యాంకు అధికారులను కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. శుక్రవారం ఇక్కడ జిల్లా స్థాయి సంప్రదింపుల కమిటీ (డీసీసీ), బ్యాంకు రుణాలపై జిల్లాస్థాయి సమీక్ష కమిటీ (డీఎల్ఆర్‌సీ) ఒకటవ త్రైమాసిక జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో బ్యాంకులు లక్ష్యాలకు మించి రుణాలు మంజూరు చేయాలన్నారు. బ్యాంకులు వ్యవసాయ, డెయిరీ, పౌల్ట్రీ, విద్యా, సోలార్‌రూఫ్ టప్, ఉపాధి రంగాలకు లక్ష్యాలకు మించి రుణాలు మంజూరు చేయాలని సూచించారు. నిరర్థక బ్యాంకు ఖాతాలలో గల నగదుకు సంబంధీకులను గుర్తించి అందజేయాలన్నారు. యూనియన్ బ్యాంక్ ఉప ప్రాంతీయ మేనేజర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# ఓంకార రూపిణి.. క్లీంకారవాసినీ..

▸▸ వాడవాడలా నేత్రపర్వంగా నవరాత్రి ఉత్సవాలు



అన్నపూర్ణదేవి అలంకరణలో సతకంపట్టు కనకదుర్గమ్మ



రాజరాజేశ్వరి అలంకరణలో కన్యకాపరమేశ్వరి



తుమ్మపాలలో మహాలక్ష్మి అవతారంలో దుర్గమ్మ

అనకాపల్లి టౌన్/ తుమ్మపాల, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : శరన్నవరాత్రి ఉత్సవాలు అంతటా అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. సందర్భంగా ఆలయాల్లో, వీధివీధినా ఏర్పాటు చేసిన మండపాల్లో కొలువుదీరిన దుర్గామాతకు విశేష పూజలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా అనకాపల్లి నూకాంబిక ఆల యంలో శుక్రవారం చండీహోమాన్ని జరిపారు. గవరపాలెం సతకంపట్టులో కొలువైన కనక దుర్గమ్మ అన్నపూర్ణదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ సహకారంతో మాలధారణ భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. కామాక్షిదేవి ఆలయంలో అన్నపూర్ణదేవిగా, కన్యకా పరమేశ్వరి ఆలయంలో రాజరాజేశ్వరీ దేవిగా, గవరపాలెం గౌరీ పంచాయతన ఆలయంలో కుక్కుటేశ్వరిదేవిగా అమ్మవార్లను అర్చకులు అలంకరించారు. విజయరామరాజుపేట అండర్ బ్రిడ్జి వద్ద నిర్వాహకులు ఏర్పాటు చేసిన అన్న సమారాధనను బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు ప్రారంభించారు. తుమ్మపాల వాటర్ వర్క్స్ వద్ద ఏర్పాటు చేసిన మండలంలో అమ్మవారు మహాలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.



# ఇథనాల్, మిథనాల్ పట్ల అప్రమత్తత అవసరం

▸▸ ఫార్మా యాజమాన్యాలకు ప్రొహిబిషన్, ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఈశ్వరరావు సూచన



సదస్సులో మాట్లాడుతున్న అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఈశ్వరరావు

పరవాడ, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఔషధాల తయారీలో ఉపయోగించే ఇథనాల్, మిథనాల్ ఆల్కహాల్ పట్ల ఫార్మా యాజమాన్యాలు అప్రమత్తంగా వ్యవహరించాలని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ బి.ఈశ్వరరావు సూచించారు. ఫార్మాసిటీలోని మ్యాచీవలీ ఎయిడెడ్ సొసైటీ ఫర్ రిస్క్ మిటిగేషన్ (ఎంఎఎస్ఆర్ఎం) కార్యాలయంలో శుక్రవారం ఫార్మా యాజమాన్య ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సదస్సులో ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ఇథనాల్, మిథనాల్ ఆల్కహాల్‌ను పరిశ్రమల నుంచి బయటకు రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత యాజమాన్యాల పైనే ఉందన్నారు. ఈ ఆల్కహాల్‌ను మద్యానికి బదులుగా సేవించే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. వీటిని అతిగా సేవిస్తే ప్రాణాలు కోల్పోయే ప్రమాదం కూడా ఉందని వివరించారు. దీనిని దృష్టిలో పెట్టుకొని ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ ఆల్కహాల్ బయటకు రాకుండా గట్టి నిఘా పెట్టాలన్నారు. అనంతరం ఆయన పలు సలహాలు, సూచనలు చేశారు. ఈ సదస్సులో టాస్క్‌ఫోర్స్ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కె.సురేష్, ప్రొబిహిషన్, ఎక్సైజ్ సీఐ డి.అనిల్ కుమార్, ఎస్ఐ వీవీ రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

## 30 కిలోల గంజాయితో వ్యక్తి అరెస్టు

▸▸ కారు స్వాధీనం ▸▸ మరో నిందితుడు పరారీ

కశింకోట, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కారులో గంజాయి తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు సీఐ అల్లు స్వామినాయుడు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి ఆయన తెలిపిన వివరాలివి. విశ్వసనీయ సమాచారం మేరకు రెవెన్యూ అధికారులు, పోలీసు సిబ్బంది తాళ్లపాలెం గంగాదేవీ ఆలయం వద్ద శుక్రవారం వాహన తనిఖీలు చేపట్టామన్నారు. కారులో గంజాయి తరలిస్తున్నట్టు గుర్తించామన్నారు. కారులో ఉన్న ఇద్దరు వ్యక్తుల్లో మాకవరపాలెం మండలం భీమబోయినపాలేనికి చెందిన డ్రైవర్ మురుకుట్టి ఈశ్వర్‌సాయి సతీష్ పట్టుబడగా, మరో వ్యక్తి పరారయ్యాడన్నారు. కారు డిక్కీలో ఉన్న ఐదు ప్యాకెట్లలో గల 30.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. పట్టుబడిన నిందితుడిపై ఇప్పటికే రెండు గంజాయి కేసులు ఉన్నాయని వివరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలిస్తున్నట్టు చెప్పారు.

## అనకాపల్లి నుంచి విజయవాడకు ప్రత్యేక బస్సులు : ఆర్టీసీ డీఎం

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అనకాపల్లి ఆర్టీసీ డిపో నుంచి విజయవాడకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్టు డిపో మేనేజర్ కె.హనుమశ్రీ తెలిపారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ అనకాపల్లి- విజయవాడ వెళ్లి తిరిగి అనకాపల్లికి రావడానికి ఒక వ్యక్తికి పల్లె వెలుగులో రూ. 900లు, అనకాపల్లి -విజయవాడ, ద్వారకా తిరుమల, అనకాపల్లికి ఒక్కొ క్కరికి రూ. 950, అనకాపల్లి- విజయవాడ, ద్వారకా తిరుమల, ద్వారపూడి, అనకాపల్లికి రూ.వెయ్యి, అనకాపల్లి- భద్రాచలం, విజయవాడ, ద్వారకా తిరుమల, ద్వారపూడి, అనకాపల్లికి రూ.1220, అనకాపల్లి- భద్రాచ లం, పర్ణశాల, విజయవాడ, ద్వారపూడి, ద్వారకా తిరుమల, అనకాపల్లికి రూ.1300 టికెట్ ధర నిర్ణయించామన్నారు. ఎవరైనా గ్రూపుగా 45 మంది వచ్చినట్లయితే వారు కోరుకున్న దగ్గర నుంచే బస్సు నడుపుతామని వివరించారు. మెట్రో ఎక్స్‌ప్రెస్, ఎక్స్‌ప్రెస్ బస్సులు కావాల్సిన ప్రయాణికులు సెల్ నంబరు 73829 18492కు సంప్రదించాలని ఆమె కోరారు.

## ప్రేమించి, మోసగించాడని సీఐఎస్‌ఎఫ్ కానిస్టేబుల్ పై ఫిర్యాదు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : యువతిని ప్రేమించి, పెళ్లి పేరుతో మోసగించిన సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్‌పై కేసు నమోదు చేసినట్టు పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్ తెలిపారు. ఇందుకు సంబంధించి ఆయన కథనం ప్రకారం వివరాలివి. చీడికాడ మండలం బైలపూడి గ్రామానికి చెందిన సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ కుంచం రాజీవ్‌గాంధీకి చోడవరం మండలం లక్కవరం గ్రామానికి చెందిన యువతితో 2017లో పెళ్లి సంబంధం చూసే నిమిత్తం అతని అక్కా బావ పొడుగు ఈశ్వరరావు, రామలక్ష్మి వెళ్లారు. యువతి కుటుంబ సభ్యులు పెళ్లికి అంగీకరించలేదు. అయితే వీరి మధ్య ప్రేమ వ్యవహారం కొనసాగింది. 2021లో రాజీవ్‌గాంధీ పట్టణానికి ఆనుకొని ఉన్న మధురానగర్‌లోని తన అక్కా బావ ఇంటికి వచ్చి బాధితురాలితో ప్రేమ వ్యవహారం నిర్వహించాడు. పెళ్లి ప్రస్తావన రావడంతో సదరు యువకుడు నిరాకరించాడు. దీంతో ఆ యువతి రాజీవ్‌గాంధీతో పాటు అతని అక్కా బావ అయిన రామలక్ష్మి, ఈశ్వరరావు, మరొకరిపై ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ చెప్పారు.

# ముగిసిన ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటకోత్సవాలు

▸▸ చివరి రోజు ప్రేక్షకుల మన్ననలు పొందిన 'విడాకులు కావాలి', 'భువి కోరని భ్రమణం'



జ్యోతి ప్రజ్వలనతో ప్రదర్శనలను ప్రారంభిస్తున్న భగవాన్



విడాకులు కావాలి నాటికలోని ఓ సన్నివేశం

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని గవరపాలెం సతకంపట్టు వద్ద జరుగుతున్న ఉభయ తెలుగు రాష్ట్రాల నాటకోత్సవాలు ముగిశాయి. శుక్రవారం రాత్రి భీమవరం నాటకాల న్యాయ నిర్ణేత రాయప్రోలు భగవాన్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రదర్శనలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళలను అంతా ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కనకదుర్గమ్మ ఆలయ శాశ్వత చైర్మన్ కాండ్రేగుల నాయుడు, వ్యవస్థాపకులు పీవీ రమణ, ఉత్సవ కమిటీ చైర్మన్ భీమరశెట్టి వరహా నూకరాజు, నాటక విరాళదాత కర్రి సన్యాసినాయుడు, నాటక పర్యవేక్షకులు కేఎం నాయుడు, మాజీ కౌన్సిలర్ కొణతాల మురళీకృష్ణ, కొణతాల సంతోష్ అప్పారావు నాయుడు, మళ్ల సూరిబాబు, పీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం అరవింద ఆర్ట్స్ తాడేపల్లి, గుంటూరు జిల్లా వారి 'విడాకులు కావాలి', హర్ష క్రియేషన్స్ విజయవాడ వారి 'భువి కోరని భ్రమణం' నాటికలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

# గొర్రెల బీమాను ఉచితంగా అమలు చేయాలి

▸▸ సమావేశంలో జిల్లా గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘ చైర్మన్ శ్రీరామ్

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గొర్రెల బీమా పథకాన్ని ఉచితంగా అమలు చేయాలని ఉమ్మడి విశాఖ జిల్లా గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం చైర్మన్ గంటా శ్రీరామ్ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం స్థానిక డీఆర్ భవనంలో జరిగిన సంఘం సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బీసీ కార్పొరేషన్ సబ్సిడీతో రాష్ట్ర గొర్రెలు, మేకల అభివృద్ధి సహకార ఫెడరేషన్‌తో రుణాలు ఇవ్వాలని కోరారు. ఎన్‌సీడీసీ రుణాలు రూ.250 కోట్లలో రెండో మంజూరు చేసిన రూ.88 కోట్లను వెంటనే విడుదల చేయాలని, మూడో విడత రూ. 120 కోట్లు త్వరగా వచ్చేలా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలన్నారు. గొర్రెలు, మేకలు పెంపకందారుల కోసం ఉపాధి హామీ పథకం కింద 90 శాతం రాయితీతో గేదెలు, ఆవులు, గొర్రెలు, మేకలు, కోళ్లకు షెడ్లు నిర్మించాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా వైస్‌చైర్మన్ సబ్బి శ్రీనివాసరావు, ఈడీ డాక్టర్ రాజశేఖర్, డైరెక్టర్ పినబోయిన అప్పారావు యాదవ్, గోకాడ దేముడునాయుడు పాల్గొన్నారు.

# అటవీశాఖ అనుమతుల్లో జాప్యం తగదు

» నిధులు ఉన్నా రహదారులు నిర్మించుకోలేని దుస్థితి

» మండల సమావేశంలో చింతపల్లి ఎంపీపీ అనుషదేవి



మాట్లాడుతున్న ఎంపీపీ అనుషదేవి

చింతపల్లి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాల రహదారుల నిర్మాణంలో అటవీశాఖ అధికారులు అనుమతులు జారీలో జాప్యం చే యడం తగదని స్థానిక ఎంపీపీ కోరాబు అనుషదేవి ఆగ్రహం వ్యక్తంచేశారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ అధ్యక్షతన సర్వ సభ్య సమావేశం జరిగింది. తొలుత వివిధ ప్రభుత్వశాఖల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను అధికారులు వివరించారు. పంచాయతీరాజ్ శాఖపై జరిగిన చర్చలో బలపం పంచాయతీ సర్పంచ్ రమేశ్ నాయుడు లోతుగెడ్డ జంక్షన్ నుంచి రాళ్లగెడ్డ వరకు రహదారి అధ్వానంగా మారి రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. లంబసింగి సర్పంచ్ కొర్ర శాంతి కుమారి పర్యాటక ప్రాంతమైన చెరువులవేనం గ్రామానికి ఈ ఏడాది జనవరిలో పీఎం జన్‌మన్ పథకంలో రూ.2.5కోట్ల నిధులు ప్రభుత్వం విడుదల చేసినా, నేటికీ నిర్మాణ పనులు ఎందుకు ప్రారంభించలేదని ప్రశ్నించారు. ఈ స్థితిలో ప్రజలు, పర్యాటకులు చెరువులవేనం వెళ్లేందుకు అవస్థలు పడుతున్నారన్నారు. దీనిపై పీఆర్‌పీ ఐయా ఏఈఈ వి. వెంకటేశ్ సమాధానం ఇస్తూ రాళ్లగెడ్డ-లోతుగెడ్డ రో డ్డుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని, చెరువులవేనం రోడ్డుకు అటవీశాఖ అనుమతులు వచ్చిన వెంటనే నిర్మాణం ప్రారంభిస్తామన్నారు. ఎంపీపీ జోక్యం చేసుకుంటూ అటవీశాఖ అడ్డంకితో మండలంలో సుమారు 25రహదారుల నిర్మాణాలు ప్రారంభంకాలేదన్నారు. నిధులున్నా నిర్మించుకోలేని దుస్థితి ఎదురైందన్నారు. దీనిపై డీఆర్‌వో వెంకటరాజు మాట్లాడుతూ అటవీ అనుమతులపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామన్నారు. అనంతరం లోతుగెడ్డ సర్పంచ్ చింతర్ల సునీల్ ఉపాధ్యాయులులేని పాఠశాలలకు వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. ఎంఈవో బోడం నాయుడుసమాధానమిస్తూ మెగా డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థులతో ప్రతి పాఠశాలలో ఖాళీలను భర్తీ చేస్తామన్నారు. జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య మాట్లాడుతూ చింతపల్లిలో గిరిజనేతరులు భూబదలాయింపు చట్టాన్ని ఉల్లంఘించి బహుళ అంతస్తులునిర్మిస్తున్నారని ఆరోపించారు. ఏఈఈ గడుతూరి స్వర్ణలత చింతపల్లిలో గత ఏడాది ముత్యాలమ్మ జాతర, వేసవిలో ట్యాంకర్లతో నీటి సరఫరా చేసినా, నిధులు మంజూరు చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ జి. ఆనందరావు, జడ్పీటీసీ పోతురాజు బాలయ్య, ఏఎంసీ చైర్‌పర్సన్ కిల్లో ఊర్మిళ, వైస్‌చైర్మన్ గోపినాయక్ శారద, సాగిన వెంగళరావు, ఎంపీడీవో సీతామహాలక్ష్మి పాల్గొన్నారు.

## ఉచితంగా మలేరియా నిర్ధారణ పరీక్షలు: డీఎంవో


ఆశ కార్యకర్తలతో మాట్లాడుతున్న డీఎంవో తులసి

పెదబయలు, సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా అన్ని పీహెచ్‌సీల్లో మలేరియా వ్యాధి నిర్ధారణ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నామని జిల్లా మలేరియా అధికారిణి ఎం. తులసి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని రూడకోట పీహెచ్‌సీని, కొరవంగి గ్రామంలో 104 వాహనంద్వారా జరుగుతున్న వైద్య శిబిరాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా పీహెచ్‌సీలో మలేరియా రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం వైద్య శిబిరాన్ని సందర్శించి రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అన్ని గ్రామాల్లో దోమల నివారణ మందు పిచికారీ చేయాలని ఆదేశించారు. ఇళ్ల పరిసరాలు శుభ్రం చేసుకోవాలన్నారు. మలేరియా సహా వివిధ విషజ్వరాలపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని ఆశ కార్యకర్తలకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టి. నాగేశ్వరరావు, కె. సుబ్రహ్మణ్యం, జి.రామారావు, భాగ్యవతి, 104 సిబ్బంది సూరి, అజీత్ తదితరులు పాల్గొన్నారు.

## టీటీడీ సొమ్ము దోచుకున్న వారిని కఠినంగా శిక్షించాలి

» విజయనగరం జోన్ ఆర్టీసీ చైర్మన్, టీడీపీ ఇన్‌చార్జి దొన్నుదొర



అరకులోయలో నిరసన చేపడుతున్న దొన్నుదొర, టీడీపీ నాయకులు

అరకులోయ, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): టీటీడీ శ్రీవారి హుండీ సొమ్ము దొంగిలించిన వారిని అరెస్టు చేయాలని కోరుతూ అరకులోయలో శుక్రవారం తెలుగుదేశం పార్టీ నేతలు ర్యాలీ, నాలుగురోడ్ల కూడలిలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ముఖ్య అతిథిగా విజయనగరం జోన్ ఆర్టీసీ చైర్మన్, అరకు అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ దొన్నుదొర పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. టీటీడీ వారి హుండీని దోచుకోవడం అపచారమన్నారు. దీనిపై పూర్తిస్థాయి విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో గుడి- బడి అనే తారతమ్యం లేకుండా దోచుకున్నారనిఆరోపించారు. చివరికి పరకామణిలో వెంకటేశ్వరుని హుండీనే దోచి ఎంతో అపచారానికి పాల్పడ్డారన్నారు. ఈ నిరసనలోమార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బొరిబొరి లక్ష్మి, టీడీపీ టీడీపీ అధికార ప్రతినిధి చిన్నగెన్ను, డుంబ్రిగుడ, హుక్కుంపేట మండలాల పార్టీ అధ్యక్షులు ఆ నంద్, సబక బొంజిబాబు, మాజీ సర్పంచ్ గొల్లోరి సుబ్బారావు, అరకు మాజీ వైస్ ఎంపీపీ అమ్మన్న, పెదలబుడువైస్ సర్పంచ్ చందూవిజయనిర్మల, చందు, ద్రౌపతి పాల్గొన్నారు.

## మంచంపై రోగి ఆస్పత్రికి తరలింపు


మొక్కపుట్టునుంచి మంగరాజు మంచంపై మోసుకు వెళ్తున్న గిరిజనులు

ముంచంగిపుట్టు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి):పలు గ్రామాలకు సరైన రోడ్డు సౌకర్యం లేక గిరిజనులకు అవస్థలు తప్పడం లేదు. మండలంలోని మాకవరం పంచాయతీ మొక్కపుట్టు గ్రామానికి చెందిన మండి మంగరాజు అనారోగ్యం బాధపడుతున్నారు. అయితే, గ్రామానికి రహదారి సౌకర్యం లేక 108 వాహనం వచ్చేపరిస్థితి లేదు. దీంతో మొక్కపుట్టు నుంచి లబడపుట్టు వరకు సుమారు రెండు కిలో మీటర్లు మం చంపై మంగరాజును యువకులు మోసుకుంటూ శుక్రవారం తీసుకువెళ్లారు. అక్కడ నుంచి 108లో ముంచంగిపుట్టు ఆస్పత్రికి తరలించారు.

## 'చిన్నతరహా పరిశ్రమలకు రుణాలివ్వండి'


మంత్రి శ్రీనివాస్‌కు వినతిపత్రం అందిస్తున్న జీసీసీ చైర్మన్

పాడేరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతంలో స్వయం ఉపాధి పొందేందుకు వీలుగా చిన్న తరహా పరిశ్రమల స్థాపనకు రుణాలందించాలని రాష్ట్ర ఎస్ఎస్ఎంఈ, సెర్ప్, ఎన్ఆర్ఐ ఎంపవర్‌మెంట్ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ కోరారు. ఈమేరకు ఆయన అమరావతిలో శుక్ర వారం మంత్రిని కలిసి వినతిపత్రమిచ్చారు. ఏజెన్సీలో లభించే అటవీ/వ్యవసాయ ఉత్పత్తుల ఆధారంగా చి న్న తరహా పరిశ్రమలను ఏర్పాటుకు సహకరించి గిరిజనులు ఆర్థికాభివృద్ధికి దోహదపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో హుకుంపేట జడ్పీటీసీ మాజీ సభ్యుడు సాగర సుబ్బారావు ఉన్నారు.

## బురదగెడ్డ వంతెనపై ట్రాఫిక్‌జామ్

» వాహనచోదకులకు తప్పని తిప్పలు


వంతెనకు ఇరువైపులా నిలిచిన వాహనాలు

అరకులోయ, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): యండపల్లివలస - అరకు గ్రామాల మధ్యనున్న బురదగెడ్డ వంతెన వద్ద శుక్రవారం ట్రాఫిక్‌జామ్ అయింది. శుక్రవారం అరకు వారపు సంత కావడంతో వాహనాల్లో వ్యాపారులు, గ్రామాల నుంచి ఆటోలు, జీపుల్లో గిరిజనులు, ప్రజలు ఈ మార్గంలో రాకపోకలు సాగించారు. బురదగెడ్డ వద్ద వంతెన అప్రోచ్ సగం మేర కూలిపోవడం నేపథ్యంలో ఇక్కడ ఇరువైపులా వాహనాలు రద్దీ పెరిగిపోయి ట్రాఫిక్ నిలిచిపోయింది. దీంతో గంటల తరబడి వాహనచోదకులు వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు యుద్ధప్రాతిపదికన వంతెన నిర్మాణం చేపట్టి రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆటో, టాక్సీవాలాలు, ఇతర వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం దసరా సెలవులు కావడంతో అధిక సంఖ్యలో వస్తున్న పర్యాటకులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఈ స్థితిలో చర్యలు తీసుకోవాలని కోరారు.

## హైడ్రో ప్రాజెక్టు రద్దు చేయాలి:ఎమ్మెల్యే మత్స్యలింగం


అనంతగిరిలో ర్యాలీ చేపడుతున్న వైసీపీ నాయకులు, గిరిజనులు

అనంతగిరి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): హైడ్రో పవర్ ప్రాజెక్టులకు అనుకూలంగా ఇచ్చిన జీవో 51ను రద్దు చేయాలని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని జూనియర్ కళాశాల నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు శుక్రవారం వైసీపీ ఆధ్వర్యంలో గిరిజనులతో కలిసి నిర్వహించిన ర్యాలీలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... హైడ్రోపై కూటమి ప్రభుత్వం గిరిజనులు ఆందోళనలు చే పడుతున్నా పట్టనట్టుగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. హైడ్రో ప్రాజెక్టులతో గిరిజన ప్రాంతాలను ముప్పునకు గురవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్. కోట మాజీ ఎమ్మెల్యే శోభ హైమావతి, ఎంపీపీ శెట్టి నీలవేణి, వైసీపీ మండల అధ్యక్షుడు కె.సూర్యనారాయణ, కో ఆప్షన్ సభ్యుడు మదీన, శోభ సోమేశ్వరి, చిన్నారావు, తదితరులు పాల్గొన్నారు.

## ఏఎంసీ చైర్‌పర్సన్‌కు సన్మానం


చైర్‌పర్సన్ ఊర్మిళను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

చింతపల్లి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గిరిజన మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలని స్థానిక ఎంపీపీ కోరాబు అనుషదేవి అన్నారు. శుక్రవారం నూతనంగా నియమితులైన వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ కిల్లో ఊర్మిళను ప్రజాప్రతినిధులు, అధికారులు ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సాధారణ వ్యవసాయ కుటుంబానికి చెందిన ఊర్మిళ ఏఎంసీ చైర్‌పర్సన్ బాధ్యతలు స్వీకరించడం గొప్ప విషయమన్నారు. చింతపల్లి సబ్ డివిజన్ పరిధి రైతుల వ్యవసాయ ప్రగతికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, ఎంపీడీవో సీహెచ్ సీతామహాలక్ష్మి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

## రావణాపల్లికి బస్సు సౌకర్యం

కొయ్యూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్ దొన్నుదొరకు వినతి ఇచ్చిన వారం లోపే రావణాపల్లికు నైట్‌హాల్ట్ బస్సును కేటాయించటంపై ఆ గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సుమారు 20 గ్రామాలకు కూడలి అయిన రావణాపల్లి నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే మంప నైట్‌హాల్ట్ చేసి ఉదయం 7 గంటల వరకు వేచి ఉండాల్సిన పరిస్థితి. ఈ విషయాన్ని గత వారం టీడీపీ మండల అధ్యక్షుడు కాకురు చంద్రరావుతో పాటు పలు గ్రామాల ప్రజలు అరకు వెళ్లి ఆర్టీసీ జోన్ చైర్మన్ దొన్నుదొరను కలసి తెలిపారు. చైర్మన్ ఆదేశాలపై పాత కృష్ణాదేవిపేట వరకు వచ్చే నైట్‌హాల్ట్‌ను రావణాపల్లి వరకు పొడిగించి, గురువారం రాత్రి నుంచి బస్సు సౌకర్యం అందుబాటులోకి తీసుకువచ్చారు.

## వరిలో అగ్గి తెగులు నివారించాలి

చింతపల్లి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వరిలో అగ్గి తెగులు వ్యాప్తి నివారణ చర్యలు ప్రారంభించాలని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సీనియర్ శాస్త్రవేత్త పి. జోగారావు అన్నారు. శుక్రవారం కొమ్మంగి పంచాయతీ ముల్లుమెట్ట, బురిసింగి, కొత్తూరు గ్రామాల్లో వ్యవసాయ అధికారులతో కలిసి శాస్త్రవేత్తలు వరి పొలాలను పరిశీలించారు. ఈసందర్భంగా జోగారావు మాట్లాడుతూ వరిలో అగ్గి తెగులు, ఆకుముడత పురుగు, పొటాష్ లోపం కనిపిస్తుందన్నారు. ఈ తెగులు నివారణకు ట్రైసైక్లెజోలు 0.6గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. ఆకుముడత పురుగు నివారణకు క్లోరైపైరిఫోస్ 2.5మిల్లీ లీటర్లు లీటరునీటిలో కలిపి చల్లాలన్నారు.ఆకులు ఎరుపు రంగులోకి మారినట్టు గమనిస్తే పొటాష్ పోషక లోపంగా గుర్తించి ఎంవోపీ(10-12కేజీ ఎకరానికి) వేసుకోవాలన్నారు. యూరియా వాడకాన్ని తగ్గించుకోవాలన్నారు. శాస్త్రవేత్త వెంకటేశ్, ఏవో టి. మధుసూదనరావు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తులు స్వీకరణ

జి.మాడుగుల, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సీడీపీ బాలమణి దేవి తెలిపారు. సొలభంపంచాయతీ గెమ్మెలిబరు, బంగరుబుడి, వంతాల పంచాయతీ కర్లపల్లిలో ఆయా ఉద్యోగాలకు మహిళలు అక్టోబరు 8వరకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

## శ్రమదానంతో తుప్పల తొలగింపు

గూడెంకొత్తవీధి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి):మండలంలోని పాములాయి గిరిజనులు శ్రమదానంతో రహదారి ఇరువైపులాతుప్పలు తొలగించారు. మండల కేంద్రం నుంచి పాములాయికి వెళ్లే రహదారి ఇరువైపులా మొక్కలు పెరిగిపోయి, వాహనచోదకులు ప్రమాదాలకు గురువుతున్నారు. ఈమేరకు స్థానిక యువత, మహిళలు శుక్రవారం శ్రమదానం చేసి మూడు కిలోమీటర్ల రహదారిలో జంగిల్ తొలగించారు.

## ఎన్‌సీసీ పీవోకు సేవా ఐకాన్ అవార్డు


ఎన్ఎస్ఎస్ పీవో విజయలక్ష్మికి అవార్డు అందిస్తున్న పర్యాటక శాఖ ఉన్నతాధికారులు

అరకులోయ, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి):ప్రముఖ స్వచ్ఛంద సంస్థ విశాఖ ట్రావెల్ అండ్ టూరిజం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యాటక దినోత్సవం పురస్కరించుకుని సెంటర్ ఫర్ యోగా అండ్ మెడిటేసన్ (సిమ్) డైరెక్టర్, స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ పీవో, చరిత్ర అధ్యాపకులు విజయలక్ష్మికు నేషనల్ సేవా ఐకాన్ పురస్కారాన్ని అందజేశారు. పర్యావరణం, యోగా, ఆరోగ్యరంగాల్లో చేస్తున్న ఆమె సేవలను గుర్తిస్తూ శుక్రవారం విశాఖలో జరిగిన కార్యక్రమంలో ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (పీపీటీడీసీ) రీజనల్ డైరెక్టర్ (ఆర్‌డీ) జీవీబీ జగదీష్, జిల్లా టూరిజం అధికారి జె. మాధవి, డాక్టర్ హరిప్రసాద్ తదితరులు ఈ పురస్కారాన్ని, ధ్రువపత్రాన్ని అందజేసి ఘనంగా సత్కరించారు. పీవో విజయలక్ష్మిని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.భరత్‌కుమార్ నాయక్, అధ్యాపకుడు, సిమ్ వ్యవస్థాపకుడు బి.రామకృష్ణ, అధ్యాపకులు అభినందించారు.

# మహాలక్ష్మికి సామూహిక ప్రత్యేక పూజలు


చింతపల్లిలో నోట్ల అలంకరణలో దుర్గాదేవి


పాడేరులో నిర్వహించిన పూజల్లో పాల్గొన్న మహిళలు

పాడేరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): దసరా శరన్నవరాత్రుల ఉత్సవాల్లో స్థానిక రాజరాజేశ్వరి ఆలయంలో శుక్రవారం రాత్రి శ్రీమహాలక్ష్మీ అమ్మవారికి సామూహికంగా ప్రత్యేక పూజలను నిర్వహించారు. మహిళా ఆధ్యాత్మిక సేవా బృందంలో ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహిళలు పాల్గొన్నారు.

### కిటకిటలాడిన ధారాలమ్మ ఆలయం

సీలేరు: జీకేవీధి మండలం ధారకొండ ఘాట్ రోడ్డులోని ధారాలమ్మ ఆలయం శుక్రవారం భక్తులతో కిటకిటలాడింది. దుర్గాదేవి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా సీలేరు పరిసర ప్రాంతాలకు చెందిన భవానీ భక్తులకు శుక్రవారం కావడంతో అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ పూజారి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భవానీ భక్తులు మార్కెట్ సెంటర్‌లోని దుర్గాదేవి సన్నిధికి చేరుకుని పూజల్లో పాల్గొన్నారు.

### లక్ష్మీదేవి అలంకరణలో దుర్గాదేవి

చింతపల్లి: స్థానిక రంగా సెంటర్‌లో ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపంలో శుక్రవారం అమ్మవారు లక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు. నగదుతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

## సురక్షిత తాగునీటి సరఫరా లక్ష్యం


మంపలో తాగునీటి పథకానికి శంకుస్థాపన చేస్తున్న ప్రసాద్ తదితరులు

కొయ్యూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మారుమూల, కొండలపైన గ్రామాలకు సైతం సురక్షిత తాగునీరందించటమే ప్రభుత్వ ధ్యేయంగా పనిచేస్తున్నదని టీడీపీ నేత, జీసీసీ మాజీ చైర్మన్ ఎంవీవీ ప్రసాద్ పేర్కొన్నారు. మంప గ్రామంలో రూ. 20.80 లక్షలతో నిర్మించనున్న తాగునీటి పథకానికి శుక్రవారం ఎంపీపీ బడుగు రమేశ్‌బాబుతో కలసి ప్రసాద్ శంకుస్థాపన చేశారు. సర్పంచ్ రామన్నపడాల్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు శివరామరాజు, మాజీ సర్పంచ్ సత్తిబాబు కూటమి నేతలు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత యోగా శిబిరం రేపు

అరకులోయ, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పర్యాటక కేంద్రం అయిన అరకులోయలో ఈ నెల 28న ప్రత్యేకంగా ఉచిత యోగా సాధన-ఆరోగ్యశిబిరం నిర్వహిస్తున్నట్లు యోగా గురువు శివరామకృష్ణ తెలిపారు. స్థానిక వెంకటేశ్వర కళ్యాణ మండపంలో నిర్వహించనున్న ఈ శిబిరంలో బీపీ, షుగర్, కీళ్లనొప్పులుతదితర ఆరోగ్యసమస్యలపై పరిష్కార మార్గాలు సూచిస్తామన్నారు.

## కాఫీ రైతులకు రుణాలు మంజూరు


జీసీసీ గొడౌన్‌ను పరిశీలిస్తున్న మేనేజర్ కుమారస్వామి

ముంచంగిపుట్టు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి):స్థానిక జీసీసీ గొడౌన్ జీసీసీ మేనేజర్ కుమారస్వామి శుక్రవారం తనిఖీ చేశారు. స్టాక్, రికార్డులను పరిశీలించారు. కిం చాయిపుట్టు, జర్రెల, కర్రిముఖిపుట్టు, ఏనుగురాయి, పెదగూడ, కిలగాడ, దొడిపుట్టు గ్రామాల 50 మంది కాఫీ రైతులకు రూ.3.25 లక్షల రుణాలను మంజూరు చేసినట్టు ఈసందర్భంగా ఆయన తెలిపారు.

## శానిటేషన్ సిబ్బంది సమ్మె నోటీసు

అరకులోయ, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో పనిచేస్తున్న పారిశుధ్య కాంట్రాక్టు కార్మికులు సమ్మె నోటీసును శుక్రవారం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామునకు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరావు ఆధ్వర్యంలో అందజేశారు. పారిశుధ్య కార్మికులకు 2024లో రూ.18, 600 వేతనం చెల్లించాలని జారీ చేసిన జీవో నేటికీ అమల్లోకి రాలేదన్నారు. పీఎఫ్, ఏరియర్స్ సమస్యలు పరిష్కరించాలన్నారు. లేకుంటే అక్టోబరు 15 నుంచి సమ్మెకు వెళ్తామన్నారు. ఆస్పత్రి శానిటేషన్ వర్కర్సు యూనియన్ కార్యదర్శి ద్రౌపతి, బాలన్న పాల్గొన్నారు.

## మహిళల ఆరోగ్య పరిరక్షణకు వైద్య శిబిరాలు


సహజ పోషకాహార ప్రదర్శనను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

పాడేరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ఏర్పాటు చేస్తున్న స్వస్థ్ నారీ ప్రత్యేక వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్‌వో టి.విశ్వేశ్వరనాయుడు అన్నారు. మండలంలో మినుములూరు పీహెచ్‌సీ పరిధి చింతలవీధి సబ్‌సెంటర్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ వైద్య శిబిరంలో 131 మంది మహిళలకు వైద్య సేవలు అందించారు. అలాగే, సహజ పోషకాలపై మహిళల్లో అవగాహనకు ఏర్పాటు చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది. ఈకార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ సాయిశ్రీ, హెల్త్ సూపర్‌వైజర్ వరలక్ష్మి, సిబ్బంది ఎస్.నాగరాజు, సుశీల, కుమారి, సంధ్య, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## జాబ్‌మేళాలో 40 మంది ఎంపిక

చింతపల్లి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జాబ్‌మేళాలో 40మంది యువకులు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. విజయభారతి తెలిపారు. శుక్రవారం కళాశాలలో మిలీనియం సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ప్రతినిధులు జాబ్ మేళా ఏర్పాటు చేశారు. ఎంపికైన యువతకు విశాఖలో ఉచిత భోజన, వసతి కల్పిస్తూ శిక్షణ ఇస్తారన్నారు. అనంతరం ఉద్యోగాలు కల్పిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనర్లు శివమణి, అరవిందు, నేహాడాలీ, గాయత్రి పాలొన్నారు.

## పర్యాటక ప్రగతి అంతంతే!

... 5వ పేజీ తరువాయి

పెంటకోట, రాజ వరం ప్రాంతాలకు పర్యాటకులు అధిక సంఖ్యలో వస్తుంటారు. కార్తీక పౌర్ణమి, శివరాత్రి పర్వదినాల్లో ఈ ప్రాంతాల్లో భక్తులు పుణ్యస్నానాలు ఆచరిస్తుంటారు. ముత్యాలమ్మపాలెం, తంతడి, పూడిమడక, రేవుపోలవరం ప్రాంతాల్లో సినిమా షూటింగ్‌లు కూడా జరుగుతుంటాయి. కానీ ఒక్కచోట కూడా తాగునీరు, మరుగుదొడ్లు, సేద తీరేందుకు నీడ వంటి కనీస సదుపాయాలు లేవు. సముద్ర తీరంలో మొత్తం 35 ప్రదేశాలను గుర్తించిన అధికారులు పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని భావించారు. కానీ ఇంతవరకు కార్యరూపం దాల్చలేదు.

**కొండకర్ల ఆవ.**

కొండకర్ల ఆవ సహజసిద్ధ అందాలకు నిలయం. సుమారు 1800 ఎకరాల్లో విస్తరించి వున్న ఈ ఆవ.. రాష్ట్రంలో కొల్లేరు తరువాత అతిపెద్ద మంచినీటి సరస్సుగా ప్రసిద్ధి చెందింది. శీతాకాలంలో ఇక్కడకు వివిధ దేశాల నుంచి రకరాల పక్షులు వస్తుంటాయి. ఆవ అందాలను తిలకించేందుకు పర్యాటకులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. ఇక్కడ కూడా సదుపాయాలు అంతంతమాత్రంగానే వున్నాయి. ఆవలో విహరించడానికి అరకొరగా నాటు పడవలు మాత్రమే వున్నాయి. కొండకర్ల ఆవ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని ప్రభుత్వాలు చెబుతున్నప్పటికీ కార్యరూపం దాల్చడంలేదు.

## స్టీల్ ప్లాంట్‌కు తొలిఅడుగు

... 5వ పేజీ తరువాయి

ఏర్పాటైతే రాష్ట్రంలో భారీ ప్రాజెక్టుగా నిలుస్తుంది. ఉక్కు పరిశ్రమకు అనుబంధంగా చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఏర్పాటుతో మరికొన్ని వేల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

**ప్రజాభిప్రాయ సేకరణకు ఏర్పాట్లు పూర్తి**

స్టీల్‌ప్లాంట్ నిర్మాణానికి కాలుష్య నియంత్రణ మండలి, పర్యావరణ అనుమతులకు సంబంధించి శనివారం చందనాడ శివారు పాటిమీద గ్రామంలో ప్రజాభిప్రాయ సేకరణ జరగనుంది. ఇందుకోసం అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. విశాలమైన సభావేదికను నిర్మించారు. పటిష్ఠమైన ఐరన్ గ్రిల్స్ ఏర్పాటు చేశారు. 400 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. నర్సీపట్నం డీఎస్పీ పి.శ్రీనివాసరావు శనివారం రాత్రి ఇక్కడకు వచ్చి సభా వేదికను పరిశీలించారు. బందోబస్తుకు సంబంధించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట సీఐ కె.కుమారస్వామి వున్నారు.

## డీఎస్సీలో మహిళలదే పైచేయి

... 5వ పేజీ తరువాయి

గురుకులాల్లో 134 మందిని ఎంపిక చేశారు. నియోజకవర్గాల వారీగా ఎంతమంది ఎంపికయ్యారనే వివరాలను విద్యా శాఖ రూపొందించింది. అన్ని కేడర్లలో కలిసి అత్యధికంగా నర్సీపట్నం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 174 అభ్యర్థులు ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. ఆ తరువాత పాయకరావుపేట నియోజకవర్గం నుంచి 147 మంది, చోడవరం నుంచి 145 మంది, భీమిలి నియోజకవర్గంలో 132, మాడుగులలో 130 మంది, విశాఖపట్నం పశ్చిమ నుంచి 77 మంది, ఎలమంచిలి, అరకు నియోజకవర్గాల నుంచి 61 మంది చొప్పున, గాజువాక నుంచి 57 మంది, అనకాపల్లి, పెందుర్తి నియోజకవర్గాల నుంచి 49 మంది చొప్పున, విశాఖపట్నం తూర్పు నుంచి 28 మంది, విశాఖపట్నం సౌత్ నుంచి 25 మంది, అతి తక్కువగా విశాఖపట్నం ఉత్తర నియోజకవర్గం నుంచి నలుగురు ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. ఇతర జిల్లాల నుంచి నాన్‌లోకల్ కోటాలో 93 మంది ఎంపికయ్యారు. కాగా ఉపాధ్యాయులుగా నియామక పత్రాలు అందుకున్న వారికి వచ్చే నెల మూడో తేదీ నుంచి శిక్షణ ఇస్తామని డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్ తెలిపారు.

# ప్రతి సమస్య విధిగా పరిష్కరించాలి: కలెక్టర్

» 'మీ కోసం'లో 121 వినతులు స్వీకరణ


ఐటీడీఏ కార్యాలయంలో పీజీఆర్ఎస్ నిర్వహిస్తున్న జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్, ఐటీడీఏ పీవో శ్రీపూజ

పాడేరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (మీకోసం) ద్వారా వచ్చిన ప్రతి సమస్యను విధిగా అధికారులు పరిష్కరించాలని కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ ఆదేశించారు. స్థానిక ఐటీడీఏలో శుక్రవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అర్జీలను ఎప్పటికప్పుడు క్లియర్ చేయడం ద్వారా పెండింగ్‌లో ఉండవని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా గిరిజనుల నుంచి అధికారులు 121 వినతులను స్వీకరించారు. పెదబయలు మండలం ఇంజెరి పంచాయతీలోని తూలం, కుమ్మరిగుంట, కొంద్రుం, లబ్బరి గ్రామాలకు రోడ్డు సదుపాయం కల్పించాలని సర్పంచ్ గెమ్మెలి రమణమ్మ కోరారు. జీకేవీధి మండలం అమ్మవారి ధారకొండ పంచాయతీలోనిమారుమూల గ్రామాలకు రోడ్లు నిర్మించాలని పలువురు వినతిపత్రాలు సమర్పించారు. అరకులోయ మండలం మాడగడ సన్‌రైజ్ పాయింట్‌లో గిరిజనులకు ఉపాధి కల్పించేలా చర్యలు చేపట్టి తమకు న్యాయం చేయాలని కోరారు.

**మీకోసం కాల్ సెంటర్ 1100 సేవలు**

ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థలో అర్జీదారులు దాఖలు చేసిన వ్యక్తులు తమ సమస్యల పరిష్కారం కాకుంటే 1100 నంబర్‌కు ఫోన్ చేసి సేవలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవో శ్రీపూజ, అసిస్టెంట్ కలెక్టర్ సాహిత్, డీఆర్‌వో కె.పద్మలత, గిరిజన సంక్షేమ శాఖ ఎస్‌డీసీ ఎంవీఎస్.లోకేశ్వరరావు, డీఆర్‌డీఏ పీడీ వి.మురళి, సమగ్ర శిక్ష ఏపీసీ స్వామినాయుడు, డీఈవో పి.బ్రహ్మాజీరావు, గిరిజన సంక్షేమ శాఖ డీడీ పరిమిళ, జిల్లా పంచాయతీ అధికారి చంద్రశేఖర్, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ ఈఈ టి.కొండయ్యపడాల్, గ్రామ సచివాలయాల నోడల్ అధికారి పీఎస్.కుమార్, జాతీయ రహదారుల డిప్యూటీ తహశీల్దార్ వి.ధర్మరాజు, జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బీఎస్. నందు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# స్కేటింగ్ క్రీడాకారిణి దీపికకు స్పీకర్ అభినందనలు


దీపకను అభినందిస్తున్న స్పీకర్

నర్సీపట్నం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): నర్సీపట్నం ప్రాంతానికి చెందిన స్కేటింగ్ క్రీడాకారిణి చైత్ర దీపకను స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అభినందించారు. ఇటీవల ఆస్ట్రేలియాలోని మౌంట్ వారెన్‌లో జరిగిన 2025 వరల్డ్ స్కేట్ పలిఫిక్ కప్ పోటీల్లో దీపిక ఇండియా తరపున పాల్గొని పేర్ స్కేటింగ్, ఇన్‌లైన్, కపుల్ డాన్స్ విభాగాల్లో బంగారు పతకాలు సాధించింది. శుక్రవారం అమరావతిలోని స్పీకర్ అయ్యన్నపాత్రుడును ఆమె కలిసింది. ఈ సందర్భంగా స్కేటింగ్‌లో మూడు బంగారు పతకాలు సాధించిన ఆమెను స్పీకర్ అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని అంతర్జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీల్లో పాల్గొని నర్సీపట్నం ప్రాంతానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు.

# భోజన పథకం బిల్లు బకాయిలు చెల్లించండి

**మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు వరలక్ష్మి**


బిల్లులు చెల్లించాలని నినాదాలు చేస్తున్న భోజన పథకం నిర్వాహకులు

చోడవరం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్నం భోజన పథకం కార్మికుల వేతనాల పెండింగ్ బిల్లులతో పాటు పారిశుధ్య కార్మికుల వేతన బకాయిలు చెల్లించాలని సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు గూనూరు వరలక్ష్మి డిమాండ్ చేశారు. మండల విద్యాశాఖ కార్యాలయం ఎదుట శుక్రవారం భోజన పథకం నిర్వాహకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, భోజన పథకం బిల్లులు మూడు నెలలుగా బకాయిలు ఉన్నాయని, దీనివల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో భోజనాలు పెడుతున్న నిర్వాహకులకు ఈ ఏడాది జనవరి నుంచి బిల్లులు మంజూరు కాలేదన్నారు. పెరుగుతున్న బడ్జెట్‌కు అనుగుణంగా భోజనాల బిల్లులు ధరలు పెంచకపోయినా, నెలల తరబడి బకాయిలు ఉంచితే పథకం ఎలా నిర్వహించగలమని ఆమె ప్రశ్నించారు. అలాగే భోజన పథకం కార్మికులకు ఇచ్చే అరకొర వేతనాలు కూడా నెలల తరబడి బకాయిలు పెడుతున్నారని, దీనివల్ల ఇబ్బందులు తప్పడం లేదని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బిల్లులు విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు బి.రాము. కె.లక్ష్మి, ఎర్రయ్యమ్మ, లక్ష్మి, రామలక్ష్మి, అప్పల నర్స, సత్యవతి, అచ్చియ్యమ్మ పాల్గొన్నారు.

## నేడు భమిడిపాటి సత్రం భూములకు కౌలు వేలం

చోడవరం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భమిడిపాటి సత్రం భూములకు శనివారం కౌలు వేలం వేయనున్నట్టు దేవదాయ శాఖ ఈవో సత్యనారాయణ తెలిపారు. జన్నవరం, హార్డింజి అతిథిగృహం వద్ద మూడేళ్ల కాలానికి ఈ వేలం నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

## 30న పీఏసీఎస్ సమావేశం

గొలుగొండ: చీడిగుమ్మల గ్రామంలో ఈ నెల 30న పీఏసీఎస్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్టు సొసైటీ చైర్మన్ బి.సత్యనారాయణ తెలిపారు. ఈ సమావేశంలో పంట రుణాలపై రైతుల నుంచి సలహాలు తీసుకుంటామని ఆయన చెప్పారు.

# మెడికల్ కాలేజీలను ప్రభుత్వమే నడిపించాలి

**ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ రాష్ట్ర నేత గౌరీశంకర్**


సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర నాయకుడు గౌరీశంకర్

చోడవరం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోనే మెడికల్ కాలేజీలను నిర్వహించాలని ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ (ఓపీడీఆర్) రాష్ట్ర నేత కసిరెడ్డి గౌరీశంకర్ డిమాండ్ చేశారు. అంబేడ్కర్ భవనంలో శుక్రవారం జనసాహితీ సంస్థ, నవయువ సమాఖ్యల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్తగా మంజూరైన 17 మెడికల్ కాలేజీలను పీపీపీ విధానంలో లీజుకు ప్రైవేటు సంస్థలకు అప్పగించాలన్న నిర్ణయం సమంజసం కాదని, దీనివల్ల రిజర్వేషన్ అభ్యర్థులకు అవకాశాలు తగ్గిపోతాయని చెప్పారు. అలాగే పేద విద్యార్థులకు వైద్య విద్య దూరమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సమాఖ్య జిల్లా కన్వీనర్ నందారపు భాస్కర్ మాట్లాడుతూ వైద్య విద్య ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అన్ని వర్గాల ప్రజలు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. జీవో 107, 108లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో స్త్రీవిముక్తి సంఘటన్ జిల్లా కన్వీనర్ ఓవీవీఎస్ లక్ష్మీకుమారి, జనసాహితీ సభ్యులు నూకాచారి, నయయువ సమాఖ్య నేతలు పి.రమేశ్, ప్రసాద్, రాజు పాల్గొన్నారు. అనంతరం పీపీపీ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆర్టీసీ బస్టాండ్ జంక్షన్‌లో రాస్తారోకో నిర్వహించారు.

## నలుగురిపై కేసు

నాతవరం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కాలువ గట్లపై బహిరంగంగా మద్యం తాగుతున్న నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తారకేశ్వరరావు శుక్రవారం తెలిపారు. కాలువ గట్లపై మద్యం తాగడం వల్ల అజాగ్రత్తతో కాలువలో పడిపోయే ప్రమాదం ఉందని ఈ సందర్భంగా ఎస్ఐ చెప్పారు. ఇకపై ఎవ్వరైనా కాలువ గట్లు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.



# వమ్మలిలో ఉరితాళ్లతో రైతుల నిరసన


ఉరి వేసుకుని నిరసన తెలుపుతున్న బాధిత రైతులు

మాడుగుల రూరల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సర్వే నంబర్లు సరిచేసి భూముల వివరాలను వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ వమ్మలి అంబేడ్కర్ విగ్రహం వద్ద బాధిత రైతులు శుక్రవారం ఉరితాళ్లు వేసుకుని నిరసన తెలిపారు. వీరికి మద్దతు వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి. వెంకన్న, జిల్లా ఉపాధ్యక్షులు కార్లె భవానీ, గిరిజన సంఘం నాయకులు నరసింహమూర్తి మద్దతు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ వమ్మలి జగన్నాథపురం, కృష్ణాపురం, రావికమతం మండలం కొమిర గ్రామాల్లో ఆరో విడత భూ పంపిణీల్లో ఉరలోవ కొండకు 450 మంది రైతులకు 2016-17లో ఆరో విడత భూ పంపిణీలో ప్రభుత్వం పట్టాలు మంజూరు చేసిందన్నారు. ఈ భూములు వెబ్‌ల్యాండ్‌లో నమోదు కాలేదన్నారు. ఈ భూములన్నీ సర్వే నంబర్లు సరిచేసి వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

## అల్పపీడనంతో భారీ వర్షం


దేవరాపల్లి ప్రధాన రహదారిపై కురుస్తున్న వాన

చోడవరం/దేవరాపల్లి/చీడికాడ/మాడుగుల/మాడుగుల రూరల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో శుక్రవారం భారీ వర్షం కురిసింది. చోడవరం, దేవరాపల్లి, మాడుగుల మండలాల్లో మధ్యాహ్నం వాతావరణం పూర్తిగా మారిపోయి జల్లుతో కూడిన మోస్తరు వర్షం పడింది. దేవరాపల్లి మండలంలో కుండపోత వర్షం కురిసింది. ఉదయం ఎండ కాయగా, మధ్యాహ్నం రెండు గంటలకు భారీ వాన పడింది. మెరక ప్రాంత వరి పంటలకు, సరుగుడు నాట్లకు ఈ వాన ఉపయోగ పడుతుందని రైతులు ఆశాబావం వ్యక్తం చేశారు. చీడికాడ మండలంలో భారీ వర్షం పడడంతో రోడ్లు, పొలాలు జలమయమయ్యాయి. ఇప్పటికే గ్రామాల్లో చెరువులు నీటితో కళకళలాడుతుండగా, ఈ వర్షానికి మరీ ఉధృతంగా గెడ్డలు పారుతున్నాయి. మాడుగుల మండల కేంద్రంలో మోస్తరు వర్షం కురిసింది. ఈ వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వాతావరణం చల్లబడింది.

## ఆరోగ్యవంతమైన మహిళలతోనే ప్రగతి


కార్యక్రమంలో మాట్లాడుతున్న బీజేపీ నేత శ్రీనివాసరావు

గొలుగొండ, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యవంతమైన మహిళలతోనే ప్రగతి సాధ్యమని బీజేపీ రాష్ట్ర నాయకుడు శ్రీనివాసరావు చెప్పారు. మండల కేంద్రంలో శుక్రవారం ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాయని, ఇందులో భాగంగా అన్ని గ్రామాల్లోనూ ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నాయని చెప్పారు. కార్యక్రమంలో గొలుగొండ పీహెచ్‌సీ వైద్యాధికారి శ్యామ్‌కుమార్, వైద్య టీడీపీ నాయకులు సుర్ల బాబ్జి, ఎ.అప్పలనాయుడు పాల్గొన్నారు.

## 156 మందికి వైద్య సేవలు

బుచ్చెయ్యపేట సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పి.భీమవరం గ్రామంలో శుక్రవారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 156 మందికి వైద్యులు సేవలు అందించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించారు. మధుమేహం, గుండె జబ్బులు, క్యాన్సర్ తదితర సమస్యలకు సంబంధించి సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు వెంకట క్రిష్ణ, రమేశ్, ఎంపీటీసీ సభ్యుల ఫోరం మండల అధ్యక్షుడు దేవర అప్పారావు, సర్పంచ్ పినపోలు రామునాయుడు పాల్గొన్నారు.

## 29న మండల సర్వసభ్య సమావేశం

రోలుగుంట, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 29న సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో నాగేశ్వరరావు తెలిపారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అన్ని శాఖ అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన సూచించారు.

## శెట్టిపాలెంలో యూరియా పంపిణీ

మాకవరపాలెం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శెట్టిపాలెం గ్రామంలో శుక్రవారం యూరియా పంపిణీ చేశారు. యూరియాపై రైతులు ఆందోళన చెందవద్దని ఈ సందర్భంగా సర్పంచ్ అల్లు రామునాయుడు చెప్పారు. రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు సరిపడా యూరియాను ప్రభుత్వం అందిస్తున్నదన్నారు. యూరియా లేదని ప్రతిపక్షాలు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని రైతులు తిప్పకొట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్.గంగవరం సర్పంచ్ దుంగల రమణ, వ్యవసాయ సిబ్బంది శేషునాయుడు,తదితరులు పాల్గొన్నారు.

## వెంకునాయుడుపేటలో బతుకమ్మ వేడుక

నర్సీపట్నం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వెంకునాయుడుపేటలో దేవీ నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం బతుకమ్మ వేడుకను నిర్వహించారు. రామాలయం మండపంలో భారీ దుర్గమ్మ విగ్రహాన్ని ప్రతిష్ఠించి, వీధిలో విద్యుత్ దీపాలతో అలంకరించారు. భవానీ మాలలు ధరించిన మహిళలు ఈ పండుగను నిర్వహించారు. మహిళలు చప్పట్లు చరుస్తూ బతుకమ్మ చుట్టూ తిరుగుతూ పాటలు ఆలపించారు. అనంతరం భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పెదిరెడ్ల దివ్య, మాజీ కౌన్సిరల్ దన్నిన రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## దుకాణాల ఎదుట చెత్త ఉంటే అపరాధ రుసుం

రావికమతం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): దుకాణాల ఎదుట చెత్త వేస్తే నిర్వాహకులకు అపరాధ రుసుం విధిస్తామని కొత్తకోట పంచాయతీ ఈవో జ్యోతీశ్వర్‌రెడ్డి హెచ్చరించారు. మేజరు పంచాయతీ కొత్తకోటలోని పలు వీధుల్లో శుక్రవారం పర్యటించి దుకాణాల ముందు చెత్త చెల్లాచెదరంగా వేయడాన్ని గమనించారు. దీంతో దుకాణ నిర్వాహకులను పిలిచి చెత్త ఎక్కడబడితే అక్కడ వేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రస్తుతం వర్షాలు పడుతున్నందున పారిశుధ్యం లోపిస్తే వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. దుకాణాల ఎదుట చెత్త బుట్టలు పెట్టుకుని అందులోనే చెత్త వేయాలని ఆయన సూచించారు.

## బెల్లం కేంద్రంలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీలు

రావికమతం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడివాడ పంచాయతీ శివారు మట్టవాని పాలెంలో బెల్లం తయారీ కేంద్రాన్ని ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ శుక్రవారం తనిఖీలు చేశారు. ఇక్కడ తయారవుతున్న బెల్లంలో నిషేధిత రసాయన పదార్థాలు, రంగులు ఉపయోగిస్తున్నారని జిల్లా కలక్టర్ ఫిర్యాదు అందిందని, కలక్టర్ ఆదేశాల మేరకు కేంద్రాన్ని తనిఖీ చేసి యజమాని శేషుబాబు వాంగ్మూలం తీసుకున్నామని ఈ సందర్భంగా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు. అలాగే కేంద్రంలో ఉన్న వస్తువులు, బెల్లం శాంపిళ్లను సేకరించామని, ల్యాబ్ రిపోర్టు ఆధారంగా తయారీదారులపై చర్యలు ఉంటాయని చెప్పారు.

## తల్లిదండ్రుల చెంతకు బాలిక

చోడవరం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిరిజన సంక్షేమ శాఖ బాలికల వసతిగృహం నుంచి పారిపోయిన గిరిజన బాలికను పోలీసులు పట్టుకుని తల్లిదండ్రులకు అప్పగించారు. అనంతగిరి మండలానికి చెందిన బాలిక ఇక్కడ వసతిగృహంలో చదువుతున్నది. గురువారం కనిపించకపోవడంతో నిర్వాహకులు బాలిక తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. పోలీసులకు కూడా ఫిర్యాదు అందించడంతో సీఐ అప్పలరాజు ఆదేశాల మేరకు ఎస్ఐ నాగకార్తీక్, సిబ్బంది గాలించారు. మాకవరపాలెంలో బాలిక ఉన్నట్టు తెలియడంతో పోలీసులు ఆమెను తీసుకువచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. గంటల వ్యవధిలోనే బాలికను తిరిగి అప్పగించడంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.

# చీటీల వలలో పడొద్దు: డీఎస్పీ శ్రావణి


బాధితులతో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రావణి

కె.కోటపాడు, సెప్టెంబరు 26 (ఆంధ్ర జ్యోతి): గ్రామాల్లో నిబంధనలకు విరుద్ధంగా నడిచే అక్రమ చీటీల వలలో పడవద్దని అనకాపల్లి డీఎస్పీ ఎం.శ్రావణి సూచించారు. మండలంలోని చౌడువాడ గ్రామంలో పెద్దిరెడ్డి పద్మ సాయి దుర్గాదేవి చీటీల పేరుతో కోట్లాది రూపాయలు స్వాహా చేసి పరారీ కావడంతో, బాధితులు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి పలువురు బాధితుల నుంచి డీఎస్పీ శుక్రవారం వాంగ్మూలాలు నమోదు చేశారు. సాక్షుల వాంగ్మూలం ఆధారాలను కోర్టుకు సమర్పిస్తామని డీఎస్పీ తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న చీటీల వ్యవహారాల్లో పాల్గొనకూడదని సూచించారు.